జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020

# ఉదయం న్యూస్

ఎడిటర్ : సి. శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక :140 పేజీలు 8 వెల : 5 శుక్రవారం 06 మార్చి 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉదయం తెలుగు దినపత్రికకు మరియు UM TV కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

జాతీయ దినపత్రిక ఉదయం న్యూస్ UM TV

Contact : 94401 40418, 63038 17489



# రహదారి పక్కన వృక్షాల తొలగింపు

తరలించేందుకు ప్రత్యేక పాలసీ తీసుకువస్తాం

అసెంబ్లీలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్




అమరావతి: రహదారుల పక్కన ఉన్న భారీ వృక్షాలను విస్తరణ సమయంలో తొలగిస్తున్నారని.. వందేళ్లకు పైగా వయసున్న చెట్లను తొలగించటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. వాటిని వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రత్యేక పాలసీ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. నెలరోజుల్లోనే ఈ విషయంపై సానుకూల నిర్ణయం వస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ బడ్జెట్ రూ. 15,485 కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖ రూ.11,217కోట్లు, అటవీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు రూ.713కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. కొత్త జిల్లాల్లో జిల్లా పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ఎన్నికల్లోపు ఈ పక్రియ జరుగుతుందని అన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపైనా దృష్టి పెడతామని తెలిపారు. మొక్కలకు జియో ట్యాగింగ్ విషయం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వివరించారు. పట్టుబడిన ఎర్రచందనం విక్రయంపై మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఏపీలో మూడు వేల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు సకాలంలో ఇచ్చామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# శాసనమండలిలో మరోమారు గందరగోళం

అచ్చన్నాయుడు క్షమాపణలకు వైసిపి డిమాండ్

గత వైసిపి లడ్డూ కల్తీ నివేదికలు తొక్కిపెట్టిందన్న ఆనం

గందరగోళం మధ్యే సభను వాయిదా వేసిన ఛైర్మన్




అమరావతి:: తీవ్ర గందరోగళం మధ్య శాసనమండలి శుక్రవారానికి వాయిదా పడింది. సభను వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషెన్ రాజు ప్రకటించారు. శాసనమండలిలో మరోసారి గందరగోళం నెలకొంది. తిరుమల నెయ్యి కల్తీ అంశంపై లఘు చర్చ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ అంశంపై వివరణ ఇస్తుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. మంత్రి వివరణ సమయంలోనే మతాల ప్రస్తావన చేసిన అచ్చెన్నాయుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం పైకి ఎక్కి నిరసన చేయడంతో సభను కొద్ది సేపు వాయిదా వేశారు ఛైర్మన్. బుధవారం ఛైర్మన్‌పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై వైసీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యుడు అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. అప్పిరెడ్డి డిమాండ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ ఆదేశాలు ఇచ్చారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఛైర్మన్‌ను ఉద్దేశించి నిన్న చేసిన వ్యాఖ్యలపై వెంటనే వివరణ ఇచ్చానని మంత్రి చెప్పారు. 'పోస్టులు పెట్టేది వాళ్లే, ప్రస్తావించేది వాళ్లే' అని వైసీపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే, నిన్న వైసీపీ అధినేత జగన్ క్రిస్టియన్ అని తాను చేసిన వ్యాఖ్యలపై ఇంతవరకు సమాధానం లేదని, ఆ వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. నిరసన మధ్యనే లడ్డూ అంశంపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వివరణ ఇచ్చారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని నివేదికలన్నీ చెబుతున్నా.. వైకాపా సభ్యులు దుష్ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. తిరుమల లడ్డూపై స్టేట్‌మెంట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వైకాపా సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితి తలెత్తడంతో మండలి ఛైర్మన్ మోషేను రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.'జగన్ నాయకత్వంలో నివేదికలను తొక్కిపెట్టిన విషయం అందరికీ తెలుసు. టెండర్లన్నీ మార్చి నిబంధనలను తుంగలో తొక్కారు. తమకు అనుకూలంగా నిబంధనలను మార్చుకున్నారు. కల్తీ జరగడం వాస్తవమేనని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఒప్పుకొన్నారు కదా. ఆనాటి తితిదే ఛైర్మన్లే ఒప్పుకొన్నప్పటికీ. . వైకాపా నేతలు మాత్రం ఒప్పుకోవడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది' అని ఆనం అన్నారు. అయినప్పటికీ వైసీపీ నిరసనలు కొనసాగడంతో ఛైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు

- రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు
- 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు
- ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం
- కటుంబ నియంత్రణ నుంచి జనాభా పెరుగదల లక్ష్యం
- పాపులేషన్ పాలసీపై చర్చ జరగాలి
- అసెంబ్లీలో డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం చంద్రబాబు



మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

2లో..




2లో..

# కుదుట పడ్డ స్టాక్ మార్కెట్లు

నష్టాల నుంచి స్వల్పంగా లాబాల్లోకి



# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు

వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

మురుగు శుద్ది కేంద్రాలపై అశ్రద్ధ

కాంగ్రెస్‌ది విధ్వంస పాలన

నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కెటిఆర్ బృందం

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది.



2లో..

# రాజ్యసభకు నితీశ్ నామినేషన్

హాజరైన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా

పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేపర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం అమిత్ షా పాట్నాకు వచ్చారు. ఆయనకు సిఎం నితీశ్ స్వాగతం పలికారు. బీహార్‌కు






## ఆశా కార్యకర్తల చలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన

విజయవాడ: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్ల 'ఛలో విజయవాడ' కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ప్రారంభమైంది. విజయవాడకు చేరుకోకుండా అనేక చోట్ల ఆశాలను అడ్డుకున్నప్పటికీ వెనుకడుగు వేయకుండా చలో విజయవాడ కార్యక్రమానికి ఆశా వర్కర్లు భారీగా తరలివచ్చారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు కల్పించాలని, ప్రభుత్వమే ఆశాలను నియమించాలని, నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫోమ్స్ ఇవ్వాలని, పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రూ.10 గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని, తదితర నినాదాలతో ధర్నా చౌక్ దద్దరిల్లింది.

## కుదుట పడ్డ స్టాక్ మార్కెట్లు

### నష్టాల నుంచి స్వల్పంగా లాభాల్లోకి




ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా గత మూడు సెషన్లలో భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడడం సూచీలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపింది. అలాగే కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా కొన్ని సానుకూల సంకేతాలు సూచీలను లాభాల వైపు నడిపించాయి. అలాగే డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి కాస్తంత కోలుకుంది. అలాగే ఆయిల్, గ్యాస్ రంగ స్టాక్స్‌లో కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి. చివరకు సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి .గత సెషన్ ముగింపు (79,116)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 400 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో దాదాపు 1200 పాయింట్లు లాభపడి 80,303 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 811 పాయింట్ల లాభంతో 79,927 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 285 పాయింట్ల నష్టంతో

24,765 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో మాజగాన్ డాక్, నాల్కో, బ్లూ స్టార్, బీఎస్ లిమిటెడ్, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఆయిల్ ఇండియా, కేపీఐటీ టెక్, ఎంఫసిస్, కోఫోర్జ్, పెర్సిస్టెంట్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 867 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 300 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 91.60గా ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్ఎస్సీ బోర్డులు పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి.

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి.

అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

## నేటి నుంచి ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక

హైదరాబాద్: 'ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 15 వరకు పది రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. నేటి నుంచి ఈ డ్రైవ్ కొనసాగనుంది. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు, పరిశుభ్రత, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. పది రోజుల కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ పురోగతి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. '6న ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మంచి పనితీరు కనబర్చిన కార్యాలయాలు, సంస్థలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పత్రాలు అందించాలని' ఉత్తర్వులో ఆయన వెల్లడించారు.

# దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు



అమరావతి,: జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(ఎ÷ఎఈ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 10 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ



హైదరాబాద్: మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి

కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల స్వావలంబనకు కట్టుబడి ఉన్నాం

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీ ఎన్నికలను విభజించిన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు .. ఇందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోందని.. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీల పునర్విభజనపైనా న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని చెప్పారు. 'స్థానిక సంస్థల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీ లో స్పష్టం చేశారు పవన్. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలను బలోపేతం చేసే చర్యలను తీసుకున్నాం అన్నారు.. అలాగే రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను తొలగించేటప్పుడు అక్కడ ఎలాంటి ప్రత్యామ్నాయం తీసుకురావాలనే దానిపై పరిశీలన జరుపుతున్నాం అన్నారు.. పర్యావరణ ప్రేమికుడిగా ఈ విషయంలో అన్ని వైపులా ఆలోచించి పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు.. కేవలం చర్యలు తీసుకోవడమే కాదు.. భవిష్యత్తులోనూ చెట్లను, వృక్షాలను సంరక్షించేలా బలమైన చట్టం తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నాం అన్నారు.. ఇది కఠినంగా అమలు చేస్తేనే పచ్చదనానికి భరోసా దొరుకుతుందన్నారు పవన్ కల్యాణ్. నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటుతున్నారు తప్పితే.. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు పవన్? సభ్యులు నా దృష్టికి తీసుకొచ్చారు. పచ్చదనం సంరక్షణకు సభ్యుల నిశిత దృష్టిని అభినందిస్తున్నాను. అదే విధంగా ఇక మీదట అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసేవాటికి, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసే పక్రియ అమలు చేయాలని భావిస్తున్నాం అన్నారు పవన్? నర్సరీల దగ్గర నుంచే దీనికి ప్రత్యేక వ్యవస్థను అమలు చేసేలా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తాం. అన్నారు.. బెంగళూరు నర్సరీల్లో అమలు చేస్తున్న అత్యాధునిక విధానాలను పరిశీలిస్తున్నాం.అన్నారు పవన్.. మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇస్తాం అన్నారు.

# చట్టసభలను మత రాజకీయ వేదికగా చేస్తారా

విజయవాడ: లడ్డూ పేరుతో మతరాజకీయాలు చేసి రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బుధవారం రాష్ట్ర శాసన మండలిలో లడ్డుపై జరిగిన చర్చ సందర్భంగా చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి మీరు క్రిస్టియన్ అని సంబోధించడం ద్వారా చట్టసభలను మత రాజకీయాలమయం చేసి భ్రష్టు పట్టించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దారుణంగా అవమానించడమేనని తెలిపారు. ఈ వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకొని భవిష్యత్‌లో మతాన్ని రాజకీయాలకు వాడుకోకుండా నిరోధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్దికాలంగా తిరుమల లడ్డు కల్తీ/అవినీతిపై జరుగుతున్న చర్చ సందర్భంగా ఉద్దేశపూర్వకంగానే మత రాజకీయాలను చొప్పిస్తున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా వారిపై చర్య తీసుకోకుండా వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయడం గర్హనీయమని తెలిపారు. ఇందుకు అధికార పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షమూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలను నిరసించాల్సిందిగా రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సిట్ నివేదిక బయట పెట్టకుండా శాసనమండలి సభ్యులకు ఒకనోటు అందించడం ద్వారా వాస్తవాలను తొక్కిపెట్టాలన్న దుర్బుద్ధి కనిపిస్తోందని తెలిపారు. ఆ నివేదికను బట్టబయలు చేసి దాని ఆధారంగా అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లడ్డు నాణ్యత తగ్గడానికి, అవినీతికి ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించిన పార్టీల ప్రభుత్వాలదే బాధ్యతని పేర్కొన్నారు. ఏ చర్యలూ తీసుకోకుండా ప్రజల విశ్వాసాలతో రాజకీయాలు చేయాలనుకోవడం తీవ్రమైన నేరమని, ఇప్పటికైనా ఇలాంటి మత విద్వేష రాజకీయాలను మానుకొని అధికార కూటమి అభివద్ధి, ప్రజా సంక్షేమం, తక్షణ సమస్యల పరిష్కారంపై దష్టి పెట్టాలని డిమాండు చేశారు.

## ఇరాన్ యుద్ధనౌకప దాడి దారుణం

టెహ్రాన్: ఇరాన్‌పై చేస్తున్న పోరులో భాగంగా.. ఆ దేశ యుద్ధనౌక ఐరిస్ దేనా పై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా ఖండించారు. దీనికి తగిన బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. ఇరాన్‌కు 2000 మైళ్ల దూరంలో సముద్రంలో అమెరికా దారుణానికి పాల్పడిందని అరాగ్చీఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ నౌక భారతదేశానికి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడినుంచి తిరిగివెళ్తుండగా అంతర్జాతీయ జలాల్లో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా దేనాపై దాడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి అగ్రరాజ్యం తీవ్రంగా పశ్చాత్తాపపడాల్సిన సమయం త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. శ్రీలంక భద్రతా దళాలు కొందరిని రక్షించగా, 87 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి.

ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నేవీ స్థావరంపై దాడి జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇది అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉంటుంది. పేలుళ్ల కారణంగా జరిగిన నష్టం గురించి ఇంకా తెలియరాలేదు.

## ఇరాన్ యుద్ధంతో చిక్కుకున్న భారతీయులు

న్యూఢిల్లీ ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో 23 వేల మంది భారతీయులు చిక్కుకుపోయినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఇజ్రాయెల్, అమెరికా దేశాలు దాడులకు దిగడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసి వేసింది. ఆ జలాల్లో ప్రయాణించే నౌకలపై దాడులు తప్పవని హెచ్చరించింది. దీంతో, ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న పలు ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయిల్ ట్యాంకర్‌లపై జరిగిన దాడుల్లో కొందరు మరణించారు. వీరిలో ఇద్దరు భారతీయులు ఉన్నట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఇక భారత్ జెండాలతో ప్రయాణిస్తున్న 36 నౌకలు కూడా అక్కడి జలాల్లో నిలిచిపోయాయి. వీటిల్లో అధిక శాతం ముడి చమురు రవాణా నౌకలేనని తెలుస్తోంది. వీటితో పాటు కొన్ని కమర్షియల్ కార్గో, ఎల్‌పీజీ గ్యాస్‌ను తరలించే నౌకలు కూడా ఉన్నాయి. ఏడు నౌకలను స్వయంగా ప్రభుత్వ రంగ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో భారత్ జెండాలు ఉన్న 12 నౌకలు, తూర్పు వైపున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో మరో 24 నౌకలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు, సౌదీ అరేబియాకు సమీపంలోని ఎర్రసముద్రంలో భారత జెండాలున్న నౌకలు లేవని సమాచారం. రెండు నౌకలు మాత్రం ప్రస్తుతం గల్ఫ్

ఆఫ్ ఏడెన్ జలాలను దాటుతున్నాయట. ఈ నౌకల్లో సుమారు 1,074 మంది భారతీయులు ఉన్నారట.

యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రాంతాల్లో పరిస్థితిని భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని నౌకలను జాగ్రత్తగా గమనిస్తోంది. అక్కడ ఇరుక్కుపోయిన భారతీయ సిబ్బందితో చర్చిస్తోంది. భారతీయ జెండాలు, సిబ్బంది ఉన్న నౌకల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా మంగళవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

## అర్జున్ టెండూల్కర్ వివాహం



ముంబై: మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణితో కలిసి హాజరయ్యారు. వీరిని సచిన్ టెండూల్కర్ కుటుంబం సాదరంగా స్వాగతించింది. అనంతరం.. ఈ కార్యక్రమానికి హాజరైన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో లోకేశ్, బ్రాహ్మణిలు మాట్లాడారు. వివాహ వేడుకలో పాల్గొనడం కోసం లోకేశ్ దంపతులు గురువారం ఉదయం ముంబైకి బయల్దేరి వెళ్లారు.ఈ సందర్భంగా నారా లోకేశ్ దంపతులు నవ వధూవరులైన అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లను ఆశీర్వదించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహ వేడుకకు హాజరయ్యారు. మాజీ క్రికెటర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కలిసి ఈ వేడుకను మరింత వైభవంగా మార్చారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు అర్జున్ – సానియాలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహ వేడుకకు హాజరయ్యారు.

# తెలంగాణకు ఐపీఎస్ అధికారుల సంఖ్య పెంచాలని కేంద్రానికి: సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచి కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కోరారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆయన అమిత్ షాతో భేటీ అయి రాష్ట్ర పోలీసింగ్‌కు సంబంధించిన పలు ముఖ్య అంశాలను చర్చించారు.
రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన రెండో క్యాడర్ రివ్యూ ఆలస్యంగా 2025లో నిర్వహించారని సీఎం గుర్తుచేశారు. ఆ సమయంలో తెలంగాణకు కేవలం ఏడుగురు ఐపీఎస్ అధికారులనే అదనంగా కేటాయించారని తెలిపారు.
దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం కూడా సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా మరింత మంది ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని వివరించారు.



ప్రస్తుతం రాష్ట్రంలో 83 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారని, ఆ సంఖ్యను 103కు పెంచాలని కోరుతూ 2026లో జరగాల్సిన మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత సమయంలోనే చేపట్టాలని కేంద్రాన్ని సీఎం అభ్యర్థించారు. ఈ భేటీలో మావోయిస్టుల లొంగుబాటు అంశంపైనా చర్చ జరిగింది. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసినట్లు వివరించారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితాన్ని గడపడానికి ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు.
అలాగే రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కూడా సీఎం కోరారు.
ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజీపీ బి. సుమతి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కే.ఈ ప్రభాకర్



**ఉత్తేజిత న్యూస్ మార్చి 05 సి.బెళగల్**

మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో గురువారం జరిగిన వివాహ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు,మాజీ ఎమ్మెల్సీ కే.యి ప్రభాకర్ ,మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గిడ్డయ్య గౌడ్ మనవడు గోవర్ధన్ గౌడ్,వివాహానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులు గోవర్ధన్ గౌడ్,నందినిలను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలకు తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గోవింద్ గౌడు,పాండురంగన్న గౌడ్ ,సి.బెళగల్ ఎంపిటిసి ఈరన్న గౌడ్, ధనంజయ, హనుమంతు, తెలుగు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు



కడప జిల్లా పొద్దుటూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గారి కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ప్రొద్దుటూరులో వధూవరులను ఆశీర్వదించిన నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు దాల్ మిల్ అమీర్ గారు

## ప్రజలను మంచే .. మూసీ అభివృద్ధి తగదు !

అభివృద్ధి పేరిట అరాచకాలు, దాని వెనక సంపాదన లక్ష్యాలు..తప్ప ప్రజల పక్షాన ఆలోచించే ప్రభుత్వాలు కానరావడం లేదు. ప్రజలకు ఏం చేస్తే బాగుపడతారన్న ఆలోచనలు చేయడం లేదు., తాయిలాలతో ఓట్లు దండుకుని పాలన చేసే రోజులు పోవాలి. స్వాతంత్ర్యం లభించి 79 ఏళ్లు పూర్తి కావస్తున్న వేళ .. ఇంకా పేదరికం తాండవించ డానికి పాలకుల దూరదృష్టి, చిత్తశుద్ధి లోపమే ప్రధాన కారణం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వస్తున్న డబ్బును సమర్థంగా నిర్వహించడం లేదు. నేటికీ కిలో రూపాయి బియ్యం అందించడం ప్రజలను అవమాన పర్చడమే. పేదరికం పేరుతో నాలుగు రాళ్లు విదిలించి తమ పబ్బం గడుపుకోవడం, దాని వెనక ఉన్న అధికారదాహం గుర్తించాలి. పథకం ఏదైనా ప్రజలను మభ్య పెట్టడం ఒకటయితే..అధికారం అంటిపెట్టు కోవడం దాని లక్ష్యంగా మారింది. అన్నింటికి మించి తెలంగాణ రావాలని, కావాలని కొట్లాడిన ప్రజలంతా దగాపడ్డారు. మోసపోయారు. కానీ తెలంగాణ పేరుతో తీపికబుర్లు చెప్పిన వారంతా అందలం ఎక్కారు. కెసిఆర్ కుటుంబం ఇందులో ముందున్నది. లక్షల కోట్ల అప్పు మన నెత్తిన పెట్టి, అధికారం పోయినా తామే అభివృద్ధి చేశామని నంగనాచి కబుర్లు చెబుతోంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల పేరుతో ఊర్లు ఖాళీ చేయించారు. భూములు గుంజుకున్నారు. వారిని రోడ్డు పడేశారు. ఊళ్లకు ఊళ్లు మాయమయ్యాయి. ఆ ప్రాజెక్టుల్లో మా ఊరు ఉందని చూసుకుని మురిసేలా ..వారి జీవితాలను మాత్రం బాగు చేయాలేదు. ఏనాడు కూడా ఆ ప్రజల గురించి కెసిఆర్ ఆలోచించలేదు. ఫార్మాసిటీ పేరుతో కూడా అలాగే భూములను లాగేసుకున్నారు. ఇక కెసిఆర్‌ను తిట్టి, ఆయన తెలంగాణను అడ్డంగా దోచుకున్నాడని చెప్పి, ప్రజల మద్దతు పొంది అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి చేస్తున్నదేమిటి? ఆయన కూడా అదే దారిలో పాలన సాగిస్తున్నాడు. అన్నీ మంచే చేస్తున్నానని చెప్పే ప్రచార క్రమంలో ప్రజలను విస్మరిస్తున్నారు. ప్రజలను విస్మరించి, వారిని గోసపెట్టి చేపట్టే పనులతో ఏం బావరుకుందామని అనుకుంటున్నారో చెప్పాలి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో కానీ, మూసీ నుంచి మురికిని తరిమి వేయడంలో కానీ ప్రజలకు అభ్యంతరం ఉండదు. ఎక్కడో సర్దార్ సరోవర్ ప్రాజెక్టులో అత్యంత ఎత్తయిన పటేల్ విగ్రహాన్ని కట్టారని, హైదరాబాద్‌లో అంతకు మించి గాంధీ విగ్రహం కట్టడం లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నంలో ఆంతర్యం బోధపడనిది కాదు. మూసీ అభివృద్ధి వరకు బాగానే ఉంది. కానీ భారీ విగ్రహాలతో సాధించేదేముంది. గాంధీకి భారీ విగ్రహం లేకుంటే ఆ మహాత్ముడికి వచ్చే నష్టం ఏమీ లేదు. కానీ ఈ విగ్రహం పేరుతో, మూసీ ప్రక్షాళన పేరుతో వేలాదిమంది ప్రజలను నిరాశ్రయులను చేయాలన్న కుటిల యత్నాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. మూసీ పరివాహక ప్రాంతంలో తరలించా లనుకుంటున్న ప్రజలకు ముందుగా ఎక్కడ ఇళ్లు నిర్మిస్తారో చెప్పండి. ఉన్న భూములను వేలం వేస్తూ పోతున్న రేవంత్ ప్రభుత్వం ఈ పేదలకు ఎక్కడ భూములు ఇస్తుందో ముందు చెప్పాలి. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా పేరుతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న మూసీ నది అభివృద్ధి ప్రణాళిక కారణంగా ఎన్నివేల కుటుంటంబాలు రోడ్డున పడతాయో చెప్పాలి. ఖమ్మం జిల్లాలో రాత్రికి రాత్రి భూదాన్ భూముల పేరుతో ప్రజలను రోడ్డున పడేశారు. ఉన్న జాగాల్లోనే వారిని ఎందుకు ఉండనీయడం లేదు. కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని చెప్పడం దగా చేయడం తప్ప మరోటి కాదు. ఉన్న భూములను అమ్ముకోవడం, ఉన్నావారిని ఖాళీ చేయించడం ద్వారా తెలంగాణ ప్రజలను రాచి రంపాన పెడుతున్న ఈ ప్రభుత్వ చర్యలను ప్రజలు నిలదీయాల్సిందే. నగరంలో మూసీ ప్రక్షాళన పేరుతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా ప్రచారం చేస్తున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి, రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్ది, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వం సంకల్పం మంచిదే అయితే ప్రజలు కూడా స్వాగతిస్తారు. కానీ అభివృద్ధి పేరుతో వారి గూడును చెదరగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నిజంగానే వారిని ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేస్తే ప్రణాళిక గొప్పగా ముందుకు సాగుతుంది. మూసీ అభివృద్ధి మంచి సంకల్పమే అయితే ఖాళీ చేయించే వారికి భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఫ్లాట్‌కు ఫ్లాట్ ఎక్కడ ఇస్తారో ముందుగా ప్రకటించాలి. అక్కడ కాలనీలు అన్ని వసతులతో నిర్మించాలి. మీరు ఇవ్వాలను కుంటున్న పిచ్చుక గూడు ఇందిరమ్మ ఇళ్లతో ప్రజలను మభ్య పెట్టరాదు. మూసీ నదిని శుద్ధి చేయాల్సిందే. ఈకంపును దూరం చేయాల్సిందే. పర్యావరణ పునరుద్ధరణ జరగాల్సిందే. వరద నియంత్రణ చేయల్సిందే. పర్యాటకాభివృద్ధి కూడా రావాల్సిందే. ఇవన్నీ నగర ప్రజలు కోరుకుంటున్నవే. మీరు చేస్తానంటే వద్దని అనడం లేదు. కానీ ప్రజలను ఏమార్చి వారిని తరిమి కొట్టి ఇదంతా చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను పొందాలన్న యత్నం మాత్రం సరికాదు. గత కొన్ని దశాబ్దాలుగా మూసీ కాలుష్యానికి గురైందన్నది కళ్లకు కనిపిస్తున్న నిజం. ప్రభుత్వం ప్రకటిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి కేవలం కార్పోరేట్ ప్రయోజనాలకే అన్న అపోహ ఉంది. అయితే మూసీ వెంట ఉన్న ప్రజల నివాస హక్కులు, జీవనోపాధి, భద్రత గాలికి వదిలేసి ముందుకు సాగాలన్న నిరంకుశ విధానమే సరికాదు. దీనినే ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల గూడును, ఇంటితో వారికున్న అనుబంధాన్ని నిరంకుశంగా తొలగిస్తామంటే కుదరదు. హైదరాబాద్ నగరంలో మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని శుభ్రపరిచి పునరుద్ధరించాలన్న సంకల్పాన్ని అక్కడ నివసిస్తున్న ప్రజలు కూడా స్వాగతించేలా కార్యాచరణ ఉండాలి.

## బంగారు కుటుంబాలకు అండగా నిలవండి.

### పి 4 జాబ్ మేళా కు విశేష స్పందన.



బంగారు కుటుంబాలకు మార్గదర్శులు అండగా నిలవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. గురువారం జీవకోనలోని విశ్వం స్కూల్ నందు నగరపాలక సంస్థ, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాను కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మార్చేందుకు మార్గదర్శులు ముందుకు వచ్చి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఈ మేళా కు సుమారు 300మంది హాజరు కాగా అందులో 200 మంది బంగారు కుటుంబాల వారు ఉన్నారని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న వారికి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించానున్నారని తెలిపారు. మంచి కంపెనీ లు అర్హులైన వారికి యాజమాన్యాలు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మూడు రోజుల పాటి ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారు ఈ జాబ్ మేళా లో పాల్గొని ఉద్యోగాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, ప్రయివేట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రెవిన్యూ అధికారి రవి, సచివాలయం కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి వివాహానికి కుటుంబ సమేతంగా హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ఉదయం న్యూస్ వనపర్తి.**



.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్ర మన్యశ్రీ మల్లు భట్టి విక్రమార్క వివాహానికి గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, సతీమణి శారద రెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు వారు పుష్ప గుచ్చాలను అందించి అభినందనలు తెలియజేశారు.

## ఎంపీ నిధుల ఖర్చులో అలసత్వం వహించవద్దు...ఎంపీ బస్తిపాటి నాగరాజు



ఎంపీ నిధుల వినియోగం మరియు అభివృద్ధి పనుల పురోగతిపై ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. నగరంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో సీ.పీ.ఓ, పంచాయితీ రాజ్, ఆర్.డబుల్యూ.ఎస్, ఏ.పి.ఈ.డబుల్యూ.ఐ.డి.సీ శాఖల అధికారులు పాల్గొన్నారు..సమావేశం లో భాగంగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వాటి పురోగతి పై ఎంపీ అధికారులతో చర్చించారు...ఈ సందర్భంగా ఎంపీ నిధుల ఖర్చులో అలసత్వం వహించవద్దని ఎంపీ నాగరాజు అధికారులకు సూచించారు...

## అగ్ని ప్రమాదానికి గురైన మెకానిక్ షాప్ బాధితుడు ను ఆదుకోండి

### ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు

**కౌతాళం ఉదయం న్యూస్ ::**



అగ్ని ప్రమాదానికి గురైన స్కూటర్ మెకానిక్ షాప్ ను పరిశీలించి యజమాని సభాపతి ని అగ్ని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్న కౌతాళం మండలం ఆర్ఐ తిక్కస్వామి వీఆర్వో నరసింహులు ఈ ఘటనలో మెకానిక్ షాప్ మరియు స్కూటర్లు, ఇతర పరికరాలు దగ్ధమై భారీ ఆస్థి నష్టం జరిగిందని ఈ ప్రమాదం వలన నష్టపోయిన స్కూటర్ మెకానిక్ షాప్ యజమానికి ప్రభుత్వం వెంటనే తగిన ఆర్థిక సహాయం చేసి ఆ కుటుంబన్ని ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రప్ప,సామేలు తదితరులు పాల్గొన్నారు..

## ఉచితంగా క్యాపులు పంపిణీ.

**హోళగుంద,ఉదయం న్యూస్:**



మండల కేంద్రంలో గురువారం స్థానిక నేతాజీ ఇంగ్లీష్ మీడియం అప్పర్ ప్రైమరీ పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఉచితంగా క్యాపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు సుధారాణి, కబీర్ సాబ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సభ్యులు మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల యొక్క ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో విద్యార్థులందరికీ ఉచితంగా క్యాపుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం మండల విద్యాధికారులు మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతిరోజు ఎండలో తిరిగేటప్పుడు ఈ యొక్క క్యాప్ లను తప్పకుండా ధరించాలని తెలియజేశారు. అదేవిధంగా ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సభ్యులు కే గోపీనాథ్,బి .మల్లికార్జున,కే.నాగప్ప,కొట్రేష్ మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో న్యాయవాది మరియన్న మృతి

**పిడుగురాళ్ల, ఉదయం న్యూస్, మార్చి 05 :**



పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ మెంబెర్ మరియు మాజీ పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పగడాల. మరియన్న నిన్న హైదరాబాద్ లో మరణించిన్నారు. గురువారం పిడుగురాళ్ల కోర్ట్ బార్ అసోసియేషన్ తరపున బార్ మెంబెర్స్ కోర్ట్ విధులను బహిస్కరించిన్నారు. మరియు పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ హాల్ లో సంతాప తీర్మానం చేసి మరియన్న లాయర్ మృతికి సంతాపం తెలిపినారు మరియు లాయర్ గా వారు చేసిన సేవలను కొనియాడినారు. ఈ కార్యక్రమం లో పిడుగురాళ్ల కోర్ట్ జడ్జి టి. ప్రవళిక హాజరు అయినారు. తరువాత పిడుగురాళ్ల కోర్ట్ బార్ అసోసియేషన్ లాయర్స్ అందరూ మరియన్న లాయర్ స్వగృమము అయిన గుళ్ళపల్లి గ్రామం లోని వారి పార్థివ దేహమునకు నివాళులు అర్పించిన్నారు. ఈ కార్యక్రమం లో పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కమదన. కుమారస్వామి, సెక్రటరీ కోపూరి. వెంకటేశ్వర్లు. సీనియర్ లాయర్ రూత్ బనియన్. కొప్పుల. రామిరెడ్డి, కంభంపాటి. కోటేశ్వరరావు, ఉడతా. కోటేశ్వరరావు. పి. మణి, పి. నవ్య, పల్లవి, పిచ్చయ్య, ప్రశాంత్ నాయక్. రమేష్ నాయక్. బాలు.అచ్చారావు. ఎం. వెంకటేశ్వర్లు. వి. రామకృష్ణ. ఎస్. వి. ఎస్. కోటేశ్వరరావు. అయాజ్ అహమ్మద్.జాకబ్. ఎం. శ్రీనివాసరావు. బత్తుల. దాస్. తదితరులు హాజరు అయి ఈ కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది అని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కమదన. కుమారస్వామి, తోపాటు పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ మరియు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తగ్గేదే లేదంటున్న ఇరాన్

టెహ్రాన్: ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులే కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి 10 దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడిచేస్తున్న విధానాన్ని చూస్తే ఆ దేశం వద్ద భారీ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయనే సందేహం తలెత్తకమానదు. అయితే.. దశాబ్దాలుగా ఆ దేశం ఎంతో కృషిచేసి ఇంత భారీఎత్తున ఆయుధ సామగ్రిని నిర్మించుకుంది. మరి ఆ దేశం ఆయుధగారాన్ని పెంచుకోవడంలో చైనా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా స్పష్టమవుతోంది. ఆ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందే ఇరాన్‌కు చైనా ఆయుధాలను సరఫరా చేసినట్లు తెలుస్తోంది. వీటిలో ఆయుధాల్లో షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుంచి ఫత్తాహ్ క్లాస్ హైపర్‌సోనిక్ మిసైల్స్ వరకు ఇరాన్ భద్రతా వ్యూహంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి శత్రు దేశాలపై దాడిచేయగల సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయి. అయితే.. ఇరాన్ ఈ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవడంలో చైనా పాత్ర ఎంతమేర ఉందనేదానిపై స్పష్టత లేదు. ఇక.. గత శుక్రవారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు దాడిచేసి.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇరాన్‌కు ప్రమాదకర ఆయుధాలను, అదనపు రక్షణ ఎలా పొందాలో చైనా వివరించిందని మధ్యప్రాచ్యంలోని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఇదిలా ఉండగా.. చైనా తయారుచేసిన సీఎం 302 యాంటీ షిప్ క్షిపణుల కొనుగోలుపై ఇరాన్-చైనా ఒప్పందం చేసుకోవాలనుకున్నట్టు రాయిటర్స్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఇరాన్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో ఎక్కువ భాగం ఆ దేశంలోనే ఉత్పత్తి అయినవే అయినప్పటికీ.. వాటిలో చాలావరకు చైనా పాత డిజైన్ల ఉత్పత్తులు లేదా చైనా తయారీ భాగాలపై ఆధారపడి ఇరాన్ రూపొందించుకుని ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం

## బాలర వసతి గృహాన్ని తనిఖీ చేసిన మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి



**తుగ్గలి:ఉదయం న్యూస్:**

మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో గల బాలుర సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి గురువారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ డొక్కా సీతమ్మ మెనూ ఆధారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన తెలియజేశారు. అనంతరం వంటశాల యందు పరిసర ప్రాంతాలను పరిశీలించి,విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన తెలియజేశారు. అనంతరం వసతి గృహం నందు పరిసర ప్రాంతాలను,గదులను పరిశీలించి సంతృప్తి చెందారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని పదవ తరగతి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి ఎంపీడీవో విశ్వ మోహన్,జొన్నగిరి బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రమేష్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యానికి పదును పెట్టిన సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

**నంద్యాల మార్చి. 5:- ఉదయం న్యూస్ ప్రతినిధి**



నంద్యాల పట్టణం సెయింట్ జాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు విద్యార్థినీ విద్యార్థులు సైన్స్ ఫెయిర్ దినోత్సవ సందర్భంగా సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నిర్వహించే సైన్స్ ఫెయిర్ (వైజ్ఞానిక ప్రదర్శన) విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం మరియు పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించే అద్భుతమైన వేదిక. ఇది ప్రాజెక్టులు, నమూనాలు (మోడల్స్ )మరియు ప్రయోగాల ద్వారా సైన్స్ అంశాలను ఆచరణాత్మకంగా నేర్చుకోవడానికి, సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి మరియు వాటిని ప్రదర్శించడానికి తోడ్పడుతుంది ప్రతి విద్యార్థి మేధాస్తుకు పదును పెట్టారు. విద్యార్థిని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా కొత్త పరికరాలకు రూపకల్పన చేస్తూ వాటి విధివిధానాలను సైన్స్ ఫెయిర్ నందు ప్రదర్శించారు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని విద్యార్థులు విద్యలోనే కాదు అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉన్నారని స్కూల్ డైరెక్టర్ టైటస్ విజయ్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మిస్సెస్ మెర్సి మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ను మర్యాదపూర్వకముగా కలిసిన కాళికాంబ ఆలయ నూతన పాలకమండలి

**నంద్యాల , మార్చి 05: - ఉదయం న్యూస్ ప్రతినిధి**



శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి చైర్మన్ గా ఎన్నికైన బింగుమళ్ల సుబ్బలక్ష్మయ్య , తన కమిటీ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటులోనూ, నూతన కమిటీ ఎంపికలోనూ మొదటి నుండి వెన్నంటి ఉండి సహకరించినందుకు గాను చైర్మన్ సుబ్బలక్ష్మయ్య మరియు ధర్మకర్తలు ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆలయ అభివృద్ధికి మరియు భక్తుల సౌకర్యార్థం కమిటీ సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

**ఉదయం న్యూస్ వనపర్తి.**



తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం సాక్షితో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భట్టి విక్రమార్కకుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి కాసేపు గడిపారు.

## లక్ష్మీ తాండ గ్రామ కర్బరీగా రాజు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నిక

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



తుగ్గలి మండల పరిధిలోని గల లక్ష్మీ తాండ గ్రామ కర్బరీగా (గ్రామ పెద్దగా) రమావత్ రాజు నాయక్ ను గ్రామ గిరిజనులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో గ్రామ కర్బరీగా ఉన్న రామావత్ రాముడు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు రామావత్ రాజు నాయక్ ను బుధవారం రోజున గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కర్బరి రాజు నాయక్, సతీమణి జానకమ్మలను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మీటూ నాయక్,హనుమంతు నాయక్ లు పూలమాలలు వేసి శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల గిరిజన సమస్యల కొరకు తనవంతు కృషి చేస్తానని గ్రామ కర్బరి రాజు నాయక్ తెలియజేశారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే.

**ఉదయం న్యూస్ వనపర్తి**



హైదరాబాద్ పట్టణంలోని బి.యన్.రెడ్డి సాగర్ రోడ్డులో గల ఒజూతీ శ్రీరస్తు కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన వివాహానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

హిందూ సాంప్రదాయంలో వివాహ వేడుకకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇలాంటి వివాహ వేడుకను ఘనంగా నిర్వహించిన లక్ష్మీనారాయణ ని ఎశ్రీఖ అభినందించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేర్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, డాక్టర్ పగిడాల శ్రీనివాస్, బ్రహ్మం చారి, సురేందర్ గౌడ్, యాపర్ల రాంరెడ్డి, రంజిత్ కుమార్, పాల్గొన్నారు

## నంద్యాల పట్టణ కేంద్రంలోని చిన్మయ మిషన్ విద్యాలయం నందు శక్తి టీం బృందాలచే అవగాహన కార్యాక్రమం ఏర్పాటు...

**నంద్యాల మార్చి .5:- ఉదయం న్యూస్ ప్రతినిధి**



నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్నీ స్కూల్లలో మరియు కాలేజీలలో మహిళలపై నేరాలు , బాల్య వివాహాల నిరోధం, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ పై నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలన్న లిజిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి సూచనలతో నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది జిల్లా పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల చిన్మయ మిషన్ విద్యాలయ హై స్కూల్ నందు విద్యార్థినిలకు శక్తి యాప్ గురించి వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి సవివరంగా తెలియజేయడంతో పాటు మీ తల్లిదండ్రులకు శక్తి యాప్ గురించి తెలియజేసి వారి సెల్ ఫోన్ లలో రిజిస్టేషన్ చేసుకునేలా చూడాలన్నాను. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరిగే సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరించి ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని అవగాహన కల్పించారు.బాల్య వివాహాలు, మహిళలు,చిన్నపిల్లలపై జరిగే నేరాలగురించి అవగాహన కల్పించి వాటికి సంబందించిన టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి వివరించారు. ఆపద సమయంలో అమ్మాయిలు శక్తి యాప్ నంబర్ 7993485111 కు ఫోన్ చేసినచో తక్షణమే స్పందిస్తామని శక్తి టీం బృందాలి తెలిపారు.నంద్యాల జిల్లాలో గల వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి శక్తి టీముల పనితీరును వివరించడంతో పాటు అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన 112/100 గురించి తెలిపారు. మీరు బాధ్యతగల పౌరులుగా ఎదగాలని, విద్యతో పాటు మంచి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కలవారని, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని

# అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

### డబుల్ ఇంజన్ సర్కార్ తో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది!

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిశారు.

అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి

నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రోత్సాహంవల్లే ఇదంతా సాధ్యమైందన్న అసోం అధికారులు.

క్రైం రేట్ తగ్గడంతోపాటు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందని వెల్లడి

గౌహతిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.

నేడు అసోంలోని దిమాహోసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించనున్న బండి సంజయ్.

అస్సోం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కారక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు. మైనింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణలతో దేశంలో అసోం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ సిబ్బంది పనితీరులోనూ ఎంతో మార్పు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలవల్లే అస్సోం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోందన్నారు.

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు అస్సాం రాష్ట్ర రాజధానిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర అతిథి గ్రుహంలో సమీక్ష నిర్వహించారు రాష్ట్రంలోని దిమా హసావో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

తొలుత అసోంలో కేంద్ర నిధులతో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై రెండు గంటలకుపైగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ, డీజీపీ హర్మిత్ సింగ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందార్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించడంతోపాటు ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటంతో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయని తెలిపారు. ముఖ్యంగా హోం, ఆరోగ్యం, వ్యవసాయం, రోడ్లు మరియు తాగునీటి రంగాల్లో అస్సాం రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. విద్య, పోషణ అభియాన్ నిధులు, వృత్తి విద్యలో అసెస్మెంట్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ద్రుష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## మార్చి 8 వ తేదీన జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, మార్చి 5: మార్చి 8 వ తేదీన జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందచేసి సన్మానించాలన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు లబ్ధిదారులైన మహిళలకు యూనిట్ల ఏర్పాటు, రుణాల మంజూరుకు సంబంధించి మెగా చెక్ అందచేయాలన్నారు. లక్ష మంది లక్షాధికారుల్లో భాగంగా జిల్లాలో 3 వేల మంది మహిళా వ్యాపార వేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మార్చి 8 వ తేదీన ఆదోని లో వన్ స్టాప్ సెంటర్ ను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభం చేస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, జిల్లాలో మహిళా దినోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి మెప్మా పిడి శ్రీనివాసులు ఐసిడిఎస్ పిడి విజయ, ఇండస్ట్రీస్ జిఎం అశోక్ కుమార్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి పాల్గొన్నారు.

# అంతా బెల్టు మయం.

### పుట్టగొడుగులా బెల్ట్ షాపులు.

### కన్నెత్తి చూడని ఎక్సైజ్ పోలీసులు.

### ముఖ్యమంత్రి ఆశయాలకు తూట్లు.

**ఉదయం న్యూస్ సి.బెళగల్ మార్చి 5.**







ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు తూట్లు పొడుస్తున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. స్వయాన ముఖ్యమంత్రి పల్లెలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తాటతీస్తానని హెచ్చరించిన మారని బెల్ట్ షాపులు తీరు మార్చుకోవడం లేదు .దీన్నంతటికి ముఖ్య కారణం ఎక్సైజ్ పోలీస్ శాఖల వైఫల్యమే నని అర్థమవుతుంది. బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుంది. ఈ బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకం దారులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో కిరాణం షాపు ముసుగులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాలలోని వివిధ రాజకీయ పార్టీల అండదండలతో బెల్ట్ షాపులు ఏకంగా వేలం పాట నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహించేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఈ బెల్టు షాపుల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా వ్యాపారం సాగడంతో ప్రతి గ్రామంలో కనీసం 3 నుండి5 బెల్ట్ షాపులు అక్రమంగా మద్యం షాపులునిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వాడవాడలా వీధి వీధిలో కిరాణం తదితర వ్యాపారం ముసుగులో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ప్రజల నుండి సొమ్ము దండుకుంటున్నారు. అలాగే కొన్ని గ్రామాలకు అయితే ఏకంగా వైన్ షాపుల నుండి ప్రత్యేక వాహనాలతో బెల్ట్ షాపుల నిర్వహకుల దగ్గరకే వైన్ షాపుల యజమానులు మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో మద్యం ప్రియులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కిరాణ షాపుల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అందిన కాటికి దోచుకుంటున్నారు. ముఖ్యంగా గాంధీ జయంతి, స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవ రోజులలో కూడా వైన్ షాపులు మూసివేసిన గాని ఈ బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. గ్రామాలలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుండగా గ్రామాలలో ఉండే స్త్రీలు, యువతులు మద్యం దారుల నుండి అసౌకర్యాలకు గురి అవుతున్న అధికారులలో మాత్రం చలనం లేదు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ పోలీసులు గాని అధికారులు గానీగ్రామాలలో నిర్వహిస్తున్న బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు బెల్ట్ షాపుల నిర్వహకులపైప విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణ గురించి ఏంపిడిఓలు

**పంచాయతీ రాజ్ ఏఈలు, ఏ పి ఎం లకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా దిశానిర్దేశం**

**సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్**




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించాలని మరియు జిల్లాలో వివిధ శాఖలకు నిర్దేశించిన పనులను వారికి కేటాయించిన వారాలలో మరియు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ను ప్రకారం కార్యక్రమంను పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ అందజేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విద్యా, వైద్యం, వనమహోత్సవం, తాగునీటి సరఫరా, సన్నబియ్యం, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ లక్ష్మీ, 500 గ్యాస్ సబ్సిడీ, సన్న వడ్లకు 500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, హాస్టల్ లలో డైట్ ఛార్జీలు పెంపుదల, పారిశుధ్యం ఇతరత్ర కార్యక్రమాల గూర్చి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ లో పలు పథకాల ద్వారా లబ్ది పొందిన వివరాలను ఫ్లెక్సీలు వెయ్యాలని తెలిపారు.

ఇందిరమ్మ గృహ ప్రవేశాలు రూఫ్ స్థాయిలో ఉన్నవి పూర్తి చేయించాలని ఆయా స్థాయిలో ఉన్న నిర్మాణాలను యుద్ద ప్రతిపాదకన పూర్తి చేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సంవత్సరంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులను ఎంపికలో పూరీ గుడిసెల్లో ఇబ్బందికరమైన పరిస్థితిలో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులుగా వారిని ఎంపిక చేయాలని తెలిపారు.

ఈ నెల మొత్తం ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ పనులు పూర్తి చేసుకుంటూ ఈ కార్యక్రమాలు చెయ్యాల్సి ఉంటుంది. ఉపాధి హామీలో కూలీల శాతం పెంచేందుకు కృషి చెయ్యాలని ఏంపిడిఓ లను ఆదేశించారు. మాస్టర్ జెనరేట్ లో సమస్యలు ఎదురైన ఎల్లప్పుడు వారికి టచ్ లో ఉంటూ రోజు వారిగా మానిటర్ చెయ్యాలని డిఆర్డిఓ జయదేవ్ ఆర్యను ఆదేశించారు.

# లక్ష్మీ పాలెం లో నేత్రపర్వంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**
**ఏనుగు వాహనంపై శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు భక్తులకు దర్శనం**

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



బద్వేలు మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు ఆలయ కమిటీ వారు భక్తుల దర్శన అనంతరం గ్రామోత్సవాన్ని మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు సాయంత్రం వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఆలయంలో శ్రీవారి మూలవిరాటును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలో కొలువుదీరిన పలు ఆలయాలను సందర్శించి స్వామి దర్శనం చేసుకున్నారు రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్న బద్వేల్ పెద్ద చెరువును సందర్శించి మట్లి రాజుల కాలంలో నిర్మించిన పెద్ద చెరువు చిన్న తోము పెద్ద తూము కట్టడాలను పరిశీలించి ఆశ్చర్యపోయారు ఇంతటి అద్భుత కట్టడాలు లక్ష్మీ పాలెం గ్రామ పరిసరాలలో ఉండడం చాలా గొప్ప విషయమని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఆలయ కమిటీ వారు గాధల సహకారంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రాత్రి తీర్థప్రసాదాలను పంపిణీ లేచారు రాత్రి 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమ్మేసంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది ఆలయ ప్రధాన అర్చకులు మొగదలై భారద్వాజు మొగదలై శ్రవణ్ నేతృత్వంలో వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా మంత్రోచ్ఛారణల మధ్య వేదమంత్రాల మధ్య జరిపించారు వేదాంతాచార్యులు గారి కుమారుడు నరసింహచార్యులు కుటుంబం వారు శ్రీవారి తరుపున కళ్యాణానికి పీటల మీద కూర్చోగా కన్యాదాత సాంఘ్య వరులు తిరువెంగళపురం గ్రామానికి చెందిన పూలుచెర్ల గురవయ్య భార్య నర్సమ్మ కుటుంబం వారు కూర్చుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణం వైభవోపేతంగా జరిపించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో హైదరాబాదుకు చెందిన కళాకారులతో నిర్వహించిన పాట కచేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది కళ్యాణ అనంతరం భక్తులు స్వామివారికి చదివింపులు చదివించి తమ భక్తిని చాటుకున్నారు అనంతరం గజ వాహనంపై శ్రీవారిని అలంకరించి భక్తుల దర్శన మంత్రం బ్రహ్మోత్సవం నిర్వహించారు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ వారు వాలంటీర్లు బద్వేల్ పట్టణ పోలీసు వారు బందోబస్తు నిర్వహించి అందరికీ స్వామివారి దర్శనం కలిగేలా చూశారు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నూతనంగా తయారు చేసిన రథం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు ఆసీనులై రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతోందని

రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని భక్తులు స్వామివారి రథాన్ని లాగితే వారికి కష్టాలు తొలగిపోయి సుఖ సంతోషాలు సిరి సంపదలు చేకూరుతాయని వేద పండితులు భక్తులకు విన్నవించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్య సంజీవ కుమార్ ఆలయ ధర్మకర్తలు కర్ణమడకల బీనా మెంటా ప్రసన్న కిరణ్ కుమార్ నల్లి వీరమ్మ సంపతి వెంకటసుబ్బయ్య అనుగొంది ఓబులేసు మద్యారి లక్ష్మమ్మ ఉంటే చిన్న పీరయ్య నాగయ్య గారి సిద్ధమ్మ ఈవో రామలింగారెడ్డి పలు శాఖల అధికారులు పట్టణ పోలీసు అధికారులు వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్య నారాయణ రెడ్డి..

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలం టేకురుపేట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు.. ఇఫ్తార్ విందులో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు గ్రామంలో ఆయనకు ఘనంగా స్వాతం పలికారు ఇదే సందర్భంగా వైఎస్ఆర్సిపి నుండి 20 కుటుంబాలు టిడిపిలోకి చేరికలు..ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓబులాపురం రాజశేఖర్ చెరుకూరి రవికుమార్ చెరుకూరి చిన్న వెంకటసుబ్బయ్య కొంకుల ' రాంబాబు ముస్లిం సోదరులు పాల్గొన్నారు..

# బద్వేల్ లో కడప జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులకు ఘన సన్మానం

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాల భూపేష్ రెడ్డి జనరల్ సెక్రెటరీ జేబీబుల్లా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా బద్వేల్ పట్టణానికి విచ్చేశారు.
ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి స్వగృహంలో వారికి ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానం చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ పట్ల అంకితభావాన్ని చాటుకున్నారు.

# కొత్తపల్లి లో రైతు శిక్షనా కార్యక్రమం

**ఆత్మకూరు ఉదయం న్యూస్**



ఈరోజు కొత్తపల్లి మండలం కింద అఖిలభారత శనగ పరిశోధన సమన్వయ పథకం కింద,ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల వారిచే రైతు శిక్షణ కార్యక్రమం మరియు క్షేత్ర దినోత్సవశీ మండల వ్యవసాయ అధికారి గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ నీలిమ, డాక్టర్ చైత్యన మాట్లాడుతూ చీదీవ+ 776, శనగరకాన్ని అధిక దిగుబడులు రావడానికి సరైన సమయంలో పంటను విత్తికోవాలి, విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలని తెలియజేశారు, ట్రైకోడెర్మావిరిడిని నెలలోనే వేసుకోవడం వల్ల నేల ద్వారా సంక్రమించే తెగులను నివారించవచ్చు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు మేలేన రకాలను ఎంచుకోవాలని, శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతులకీ అనుగుణంగా కొత్త రకాలను అందిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మంజునాథ్,డాక్టర్ నీలిమ, డాక్టర్ చైత్యన మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం, గ్రాూజా చైర్మన్ నాగేశ్వరరావు, నారాయణ, గిరిజన రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా.శ్రీ రంగనాథ స్వామి రథోత్సవం. రూ. 32 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు .

**ఉదయం న్యూస్ వనపర్తి.**



చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయంతో పాటు, రహదారులు వసతి గృహాలు, రంగసముద్రాన్ని అభివృద్ధి పరిచి బోటింగ్ ఏర్పాటు చేసేందుకు, రంగసముద్ర నుంచి వచ్చే వరద వలన పంట కాలువలు కోసుకుపోకుండా ఉండేందుకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారుశ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , వనపర్తి రాజవంశీయులు రాజా కృష్ణదేవరావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో నుంచి పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు చేర్చారు.అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరంగాపురం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని.ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని రూ 5 కోట్లతో టూరిజం హబ్బుగా మార్చనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.రూ. 2 కోట్ల రూపాయలతో ఆలయానికి
సంబంధించిన ప్రధాన రహదారిని బాగు చేయనున్నట్లు ఆయన తెలిపారు.1 కోటి 50 లక్షల రూపాయలతో అతిథి గృహాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రాయచోటి, మార్చి 05: (ఉదయం ప్రతినిధి )**




యువత డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగం పిలుపునిచ్చింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ పర్యవేక్షణలో గురువారం మసాపేటలోని శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో "ఈగల్ సెల్" ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, ఒక కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాక్ట్ కింద డ్రగ్స్ రవాణా లేదా వినియోగం చేస్తే ఎదురయ్యే కఠినమైన శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన నార్కో పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించేందుకు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులే స్వచ్ఛందంగా డ్రగ్స్ నియంత్రణలో భాగస్వాములు కావడానికి 'ఈగల్ క్లబ్స్' విశేషంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న సుమారు 300 మంది విద్యార్థులు ఒకే స్వరంతో "డ్రగ్స్‌కు చెక్... ఈగల్ తో సేఫ్!", "దేశాన్ని ప్రేమిద్దాం -- డ్రగ్స్‌ను ద్వేషిద్దాం" అంటూ నినదించడం విశేషం. అనంతరం విద్యార్థులందరితో డ్రగ్స్ తీసుకోబోమని, ఇతరులను కూడా అటువైపు వెళ్లకుండా అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరి సెల్ ఫోన్లలో ఈగల్ సెల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌ను సబ్‌స్క్రైబ్ చేయించారు. దీని ద్వారా డ్రగ్స్ నివారణపై నిరంతరం అప్‌డేట్స్ పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుళాయప్ప, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, శక్తి టీమ్ సభ్యులు మరియు ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఊరి బడిని కాపాడుకుందాం.



## యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పిలుపు.

**బద్వేలు ఉదయం ప్రతినిధి**

పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడిని కాపాడుకోవాల్సిందేనని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు బి.ఈశ్వరరావు అధ్యక్షతన ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాదన విజయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలిస్తున్న పాలకవర్గాలు గద్దెనెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యను ప్రమాదం లోకి నెడుతున్నారన్నారు. సేవా రంగమైన ప్రభుత్వ బడుల నిర్వహణ బాధ్యతల నుండి పాలకులు క్రమేపి తప్పుకుంటున్నారని ఆరోపించారు. గతంలో వైసిపి ప్రభుత్వం జీవో 117 ను ప్రవేశపెట్టి, పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మార్చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాన్ని అప్పటి ప్రతిపక్ష హోదాలో తప్పు పట్టిన కూటమి పెద్దలు, తాము అధికారంలోకి రాగానే 117 జీవోను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలికారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం జీవో 117 ను పాక్షికంగా రద్దుచేసి, దాని స్థానంలో జీవో 20 ని అమలు చేశారే తప్ప విధానాల్లో మాత్రం ఏ మార్పు లేదన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థలతో చేసుకున్న ఒప్పందాల మేరకే ప్రభుత్వ రంగాన్ని ఉద్దేశపూర్వకంగా పాలకులు నిర్వీర్య పరుస్తున్నారని ఆయన ఆరోపించారు. సాల్ట్ పథకం అమలులో భాగంగా ప్రపంచ బ్యాంకు నుండి 1750 కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం, వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రభుత్వ విద్యకు పాడె కట్టేందుకు ప్రయత్నిస్తున్నదని తీవ్రంగా విమర్శించారు. బోధనేతర కార్యక్రమాల పేరుతో పేద విద్యార్థులకు విద్య అందకుండా ప్రభుత్వం చేసే కుట్ర అందులో భాగమేనన్నారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను నిర్వీర్య పరుస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. పాలకుల విధానాల ఫలితంగా రాష్ట్రంలో 17వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పేదల పట్ల మక్కువ లేని పాలకవర్గాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్పొరేట్ విద్యకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారన్నారు. ప్రభుత్వ బడులు మూతపడితే పేద, బడుగు, బలహీనవర్గాలు విద్యకు దూరమవుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులను కాపాడుకుంటూ పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యుటిఎఫ్ కృషి చేస్తున్నదని అందులో భాగంగానే "ఊరిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ కార్యాచరణ ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని, ఫిబ్రవరి మాసం నుండే విద్యార్థుల ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించమని, విద్యార్థుల తల్లిదండ్రుల చైతన్య పరచడంతో పాటు, మేధావుల, విద్యావేత్తల, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఊరి బడిని కాపాడుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, యుటిఎఫ్ శ్రేణులు ఊరి బడి కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. పోరుమామిళ్ల మండల విద్యాశాఖాధికారి ఎ.వెంకటయ్య, రిటైర్డ్ డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డి.మార్కా రెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. కార్పొరేట్ మాయాజాలంలో పడి తల్లిదండ్రులు కార్పోరేట్ విద్యా సంస్థల వైపు మొగ్గుచూపుతూ ప్రభుత్వ బడుల పట్ల నిర్లక్ష్యం కనపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, దీంతోపాటు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, సమరూప దుస్తులు, నాణ్యమైన భోజనం ఉచితంగా అందజేస్తారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల మోజుతో ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఊరిబడి కనుమరుగవుతుందని, తద్వారా పేదలు చదువుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని వారు పేర్కొన్నారు. యుటిఎఫ్ చేపట్టిన ఈ యజ్ఞంలో ఉపాధ్యాయ లోకం పెద్ద ఎత్తున భాగస్వాములై ఊరి బడిని కాపాడుకునేందుకు కంకణం కట్టుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య, కె.ప్రసాద్, ఎ.డి.దేవదత్తం, సీనియర్ నాయకులు కె.జోజయ్య, పోరుమామిళ్ల మండల ప్రధాన కార్యదర్శి ఎస్.మహబూబ్ బాషా, కలసపాడు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బాల ఓబయ్య ,
సి.ప్రభాకర్, కాశినాయన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.భాస్కర్ రెడ్డి, ఎస్.గురప్ప, బి.కోడూరు మండల అధ్యక్ష, ప్రధాన
కార్యదర్శులు ఎల్.పిచ్చిరెడ్డి,

# హార్ముజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !



పిల్లికి చెలగాలటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా,అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్ముజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళు _న్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్ల చమురు హార్ముజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్‌జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్ముజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది.

ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హార్ముజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్ముజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో

మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుంద నుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

# విద్యుత్ వినియోగంలో అరుదైన మైలురాయి

హైదరాబాద్: వేసవి మొదలై అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ వినియోగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. మార్చి 3వ తేదీ మంగళవారం ఉదయం 11:01 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. వేసవి కాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న తరుణంలో, ఇంతటి భారీ స్థాయిలో విద్యుత్ అవసరం ఏర్పడినప్పటికీ, ఎక్కడా చిన్నపాటి అంతరాయం కూడా లేకుండా సరఫరాను కొనసాగించి రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ సమర్థతను చాటుకున్నాయి. గతేడాది మార్చిలో నమోదైన 15,623 మెగావాట్ల రికార్డును, అలాగే గత నెలలో నమోదైన గణాంకాలను ఈ కొత్త రికార్డు వెనక్కి నెట్టేసింది. రాష్ట్రంలో పారిశ్రామికాభి వృద్ధి, ఐటీ రంగ విస్తరణతో పాటు ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయానికి అందిస్తున్న నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా సాగునీటి అవసరాల కోసం రైతాంగం మోటార్లను పెద్ద ఎత్తున వినియోగిస్తుండటం, పట్టణ ప్రాంతాల్లో ఏసీల వాడకం పెరగడం వంటి అంశాలు విద్యుత్ వినియోగాన్ని గరిష్ట స్థాయికి చేర్చాయి. భౌగోళికంగా చిన్న రాష్ట్రమైనప్పటికీ, విద్యుత్ డిమాండ్ విషయంలో తెలంగాణ ఇప్పుడు రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలతో పోటీ పడుతోంది. పంజాబ్, హర్యానా వంటి పారిశ్రామిక రాష్ట్రాల కంటే తెలంగాణలో డిమాండ్ ఎక్కువగా ఉండటం ఇక్కడి ఆర్థిక పురోగతికి నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ చారిత్రాత్మక ఘనతపై ఉప ముఖ్యమంత్రి , ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా హ్యాండిల్ చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులను , సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రం ఎంతటి భారీ డిమాండ్‌నైనా తట్టుకునేలా సబ్-స్టేషన్ల పటిష్ఠత, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ 19,000 మెగావాట్లను దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'తో ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఇరాన్ అధినేతను హత్య చేసినా నోరు మెదపరా

**ఇదెక్కడి విదేశాంగ విధానమో మోడీ చెప్పాలి**

**ఇరాన్‌పై దాడి గురించి మోడీకి ముందే తెలుసా**

**కూటమి నేతలు కూడా ఖండించక పోవడం దారుణం**

**మీడియా సమావేశంలో బివి రాఘవులు, శ్రీనివాసరావు**

విజయవాడ: ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి కేవలం ఇరాన్ కే పరిమితం కాకుండా ప్రపంచాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేసే స్థాయికి చేరుకుంటుందని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బివి.రాఘవులు మాట్లాడుతూ వెంటనే ఈ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నేడు అమెరికా పలు అబద్దాలను చెప్పి ప్రపంచ ప్రజానీకాన్ని మభ్యపెట్టి యుద్దాన్ని మారణహోమాన్ని సమర్థించుకుంటుందని, ట్రంప్ ప్రయత్నాన్ని ప్రపంచ ప్రజలంతా, శాంతి కాముకులంతా ఖండించాలని కోరారు.

అన్ని సందర్భాలలో భారతదేశానికి గట్టి మిత్రుడిగా ఉన్న ఇరాన్ పై మరో దేశం దాడి చేసి ధ్వంసం చేస్తుంటే దాన్ని ఖండించాల్సిందిపోయి ఇంతవరకు భారత ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా జరుపుతున్న దాడిని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి, ప్రతిపక్ష వైసిపి ఖండించాలని బి.వి.రాఘవులు కోరారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ నాయకత్వంతో మాట్లాడి వచ్చిన తరువాతే ఇరాన్‌పై దాడి జరిగిందని, దాడి గురించి ముందే మోడీకి తెలిసి ఉండాలని అన్నారు. బలమైన నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్న కేంద్రం దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయిందో చెప్పాలన్నారు. లేక దాడి విషయం ముందే తెలిసి ఇజ్రాయిల్ ప్రధానిని కలిశారా? అదైనా బయటపెట్టాలన్నారు. ఇరాన్ అన్ని సందర్భాల్లోనూ భారత దేశానికి మంచి మిత్రుడిగా ఉందని, అయినా ఆ దేశ అధినాయకుడిని చంపేస్తే స్పందించకుండా యుఏఈలో అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశారనే అంశంపై మాత్రమే స్పందించడం అన్యాయమని తెలిపారు. ఇరాన్‌పై దాడితో ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా ఇండియా పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడిని నిలిపేయాలని అన్ని దేశాలూ డిమాండు చేయాలని అన్నారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, సఫలమవుతున్నాయని అనుకున్న సమయంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి చర్చలకు విఘాతం కలిగించాయని అన్నారు. అప్రజాస్వామికంగా స్కూళ్లపై దాడిచేసి విద్యార్థులను చంపేసిందని తెలిపారు. తమపై దాడి చేస్తారనే ఉద్దేశంతోనే తాము దాడిచేశామని ట్రంప్ చెబుతున్న మాటలు అబద్దాలని, ఇరాన్ అటువంటి ఆలోచనలు చేయడం లేదని పెంటగాన్ నివేదిక తెలిపినా దాడి చేశారని తెలిపారు. అయితే మోడీ దెబ్బతినిపోతున్న ఇరాన్ తరుపున కాకుండా దాడి చేస్తున్న దేశం తరుపున ' మిత్రులు, శత్రువులకు తేడా తెలియకుండా వ్యవహరించారని అన్నారు. ఈ విషయంలో అమెరికా వ్యూహంలో మోడీ భాగస్వామ్యం అయ్యారని, ఇజ్రాయిల్ తరుపున స్పందించి దేశ ప్రతిష్టను దిగజార్చారని తెలిపారు. ఇరాన్‌లో శుద్ధి కేంద్రాలను ధ్వంసం

చేశామని గతంలోనే చెప్పిన అమెరికా అదే సాకుతో ఇప్పుడు దాడిచేయడం అమానుషం అన్నారు.

కేంద్రం తీసుకొస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మార్చి 24వ తేదీన సిపిఎం ఆధ్వర్యాన ఢిల్లీలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని రాఘవులు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా చట్టాలు అమలు చేస్తోందని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తున్నామని అన్నారు. జీరాంజీ కొత్త చట్టాన్ని తీసుకురావడం వల్ల పేదలు ఉపాధి కోల్పోయారని, దీన్ని ఉపసంహరించాలనేది ప్రధాన డిమాండని పేర్కొన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు వెనక్కు తీసుకోవాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని, న్యూక్లియర్ లయబిలిటీ బిల్లునూ తీసుకువచ్చారని, వాటిని రద్దు చేయాలని సిపిఎం డిమాండు చేస్తోందని పేర్కొన్నారు. ఇవి కాకుండా విదేశీ విత్తన కంపెనీల కోసం సీడ్‌బిల్లును తీసుకువస్తుందని అన్నారు. మరోవైపు అమెరికా 18 శాతం ట్యాక్సు విధించిందని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు జరిపి మార్చి 24న డిల్లీలో కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు.

# తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

వాషింగ్టన్: 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే.

ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట. అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది.

# వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ప్రణాళిక

**ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



హైదరాబాద్: మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండి పోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

## ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

**కలెక్టర్లకు మంత్రి పొంగులేటి హితవు**



హైదరాబాద్: ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే మీ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

## జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో దారుణ ఘటన

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న మాజీమంత్రి**

మహబూబ్‌నగర్: జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్న కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించు కోవడం లేదని వెల్లడించారు. కనీస సౌకర్యాలు కల్పించక హాస్పిటళ్లు దీనావస్థకు చేరుకుంటున్నాయని వివరించారు. వసతులు లేవు. మందులు లేవని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటళ్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త హాస్పిటల్స్ నిర్మించాం.పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని వెల్లడించారు. పాత రోజులు తెస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిజం చేసిందన్నారు. కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ పూర్తి అయినా వాడుకోలేదని పేర్కొన్నారు.మార్చురీని ఎందుకు మార్చలేదని, పాత దాంట్లో ఫ్రీజర్,స్ట్రెచర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలన గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, జడ్చర్లలో స్థలాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం సొంత జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇన్‌ఛార్జ్ గా ఉన్న జిల్లాలో ఇంతటి దుస్థితి నెలకొనడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజలు సమస్యను వివరిస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు.

## సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత


హైదరాబాద: సంపూర్ణ చందగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చందగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చందగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసు కున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు.

# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# కుటుంబ కలహాలు

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



భువనగిరి: కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఒకటికి మించి బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయా?

ప్రస్తుత రోజుల్లో చాలా మంది ఒకటికి మించి బ్యాంక్ అకౌంట్లు వాడుతున్నారు. అవసరాల రీత్యా, ఉద్యోగాల రీత్యా ఇలా ఏదైనా కారణం కావొచ్చు. ఎక్కువ బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేస్తున్నారు. వీటిల్లో అన్నీ వినియోగిస్తూ ఉండరు. అయితే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లు ఉంటే కొన్ని నష్టాలు ఉంటాయి. ఆ ఇబ్బందులు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.
దాదాపు ప్రతి ఒక్కరి దగ్గర ఇప్పుడు బ్యాంక్ ఖాతా ఉంటుంది. ఉద్యోగాలు చేసే వారికి, ఇంకా పింఛన్లు తీసుకునే వారికి, చదువుకునే వారికి స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ వంటి వాటి కోసం అకౌంట్లు ఓపెన్ చేస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారు మాత్రం జాబ్ మారితే దాదాపు కొత్త అకౌంట్ ఓపెన్ చేయాల్సిన పరిస్థితులు ఉంటాయి. అయితే ఇప్పుడు అధిక బ్యాంక్ అకౌంట్లు ఉండటం వల్ల కలిగే ఇబ్బందులేంటో చూద్దాం. చాలా మంది ఉద్యోగాలు మారుతుంటారు. అక్కడి యజమాని వారితో టైఅప్ అయిన బ్యాంకులో శాలరీ అకౌంట్స్ ఓపెన్ చేయిస్తుంటారు. ఇంకా వ్యాపారం, పెట్టుబడులు వంటి వాటి కోసం అదనపు ఖాతాల్ని కలిగి ఉంటారు.



అలాంటప్పుడు బ్యాంక్ అకౌంట్లు పెరిగిపోతుంటాయి. అకౌంట్ హోల్డర్‌కు లాకర్ అవసరం పడినప్పుడు.. ఖాతా ఉన్న బ్యాంకులో లాకర్ దొరక్కపోవచ్చు. అప్పుడు కస్టమర్ వేరే బ్యాంకును ఆశ్రయించి అక్కడ ఖాతా అకౌంట్ తెరవాల్సి ఉంటుంది. ఇలా సేవింగ్స్ అకౌంట్లు పెరిగిపోతుంటాయి.చాలా మంది తమ జీవిత కాలం పూర్తయ్యేలోగా ఒక్క పెద్ద రుణమైనా తీసుకుంటుంటారు. హోం లోన్, బిజినెస్ లోన్, పర్సనల్ లోన్ ఇలా ఏదైనా కావొచ్చు. వడ్డీ రేట్లు సహా ఇతర ఛార్జీలు తక్కువగా ఉండే బ్యాంకుల కోసం వెతుకుతుంటారు. అప్పుడు ఆ బ్యాంకులో అకౌంట్ తెరవాల్సి రావొచ్చు. దాదాపు అన్ని సేవింగ్స్ అకౌంట్లలో కనీస మొత్తం నగదు నిల్వ చేయాల్సి ఉంటుంది. మినిమం బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయకపోతే చాలా బ్యాంకులు నాన్ మెయింటెనెన్స్ ఛార్జీలు విధిస్తుంటాయి. కొన్ని బ్యాంకుల్లో రూ. 1000 కనీస బ్యాలెన్స్‌గా ఉంటే.. ఇంకొన్ని బ్యాంకుల్లో రూ. 25 వేల వరకు కూడా ఉంది.
ఇంకా బ్యాంక్ అకౌంట్లకు డెబిట్ కార్డు ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు సహా బ్యాంకుల్ని బట్టి ఎన్నో రకాల ఛార్జీలు ఉంటాయి. మీ దగ్గర ఎన్ని అకౌంట్లు ఉంటే అన్ని ఛార్జీలు చెల్లించాల్సిందే. శాలరీ అకౌంట్ జీరో బ్యాలెన్స్ అకౌంట్ అయినా దీనితో పెద్దగా ప్రయోజనాలు ఉండవు. ఎక్కువ బ్యాంక్ అకౌంట్లు ఉన్నప్పుడు మీరు కాస్ట్ టు బెనిఫిట్ విశ్లేషణ చేయాలి. ప్రతి బ్యాంక్ అకౌంట్ నిర్వహించేందుకు ఎంత డబ్బు కావాలి? మొత్తం సంవత్సరం ఛార్జీలు ఎంత ఉంటాయి? అనేది ముందే చెక్ చేసుకోవాలి. అప్పుడు ముఖ్యమైన కొన్ని అకౌంట్లను మాత్రమే నిర్వహించుకోవచ్చు. అప్పుడు ఛార్జీల భారం తప్పించుకోవచ్చు. డబ్బుల పట్ల నియంత్రణ ఉంటుంది.

# ఎలక్ట్రిక్ వాహనాలు కొనేవారికి శుభవార్త..

ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి అదిరే శుభవార్త. విద్యుత్తు వాహనాలపై రాయితీ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో ఫేమ్-2 రాయితీ పథకాన్ని మరో 4 నెలల పాటు పొడిగిస్తోంది. ఆ వివరాలు ఓసారి తెలుసుకుందాం.
దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు మంచి డిమాండ్ ఉంది. ఎలక్ట్రిక్ స్కూటర్లు, బైక్స్, ఆటోలు, కార్లు కొనుగోళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యుత్తు వాహనాల తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్-2పథకాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీని ద్వారా రాయితీలు కల్పిస్తోంది. ఇప్పుడు ఈ ఫేమ్ 2 పథకాన్ని మరో నాలుగు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సమాచారం. అందుకోసం అదనంగా రూ. 500 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ స్కీమ్ 2024 మార్చి 31 తో ముగియనుంది. ఈ క్రమంలో ఈ రాయితీ పథకాన్ని మరో 4 నెలల పాటు పొడిగించాలని కేంద్రం నిర్ణయం



తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి.
ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమ నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఫేమ్ 2 రాయితీ పథకాన్ని తాత్కాలికంగా పొడిగిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నట్లు సీఎన్‌బీసీ- టీవీ 18 వెల్లడించింది. విద్యుత్తు వాహనాల విక్రయాలు క్రమంగా పుంజుకుంటున్న క్రమంలో ఈ పథకాన్ని తొలగించడం ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ధరలు పెరగడంతో విక్రయాలు ఒక్కసారిగా పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నాయి.
ఫేమ్- పేరిట ఇప్పటికే రెండు విడతల్లో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లకు రాయితీలు అందించింది కేంద్ర ప్రభుత్వం. ఫేమ్- 3 ని కూడా తీసుకొచ్చే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆర్థిక శాఖకు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు సైతం పంపించింది. రూ. 12,600 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. తాజాగా ఫేమ్- 2 పొడిగింపు నేపథ్యంలో ఫేమ్- 3 రాయితీ పథకానికి సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఆమోదం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫేమ్- 3 దాదాపు రెండేళ్ల పాటు అమలులో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎలక్ట్రిక్ ట్రక్కులు, ట్రాక్టర్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలకు రాయితీలు అందించేందుకు ఫేమ్ 3 తీసుకురానుంది. వాహన్ వెబ్‌సైట్ ప్రకారం 2024 ఫిబ్రవరిలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు 24 శాతం పెరిగాయి. 2023, ఫిబ్రవరి నెలలో 66,053 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి.. ఈ సారి అవి 81,963 యూనిట్లకు పెరిగింది. ఈ ఆర్థిక 2023-24 ఏడాదిలో 8 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరిగాయి. అందులో ఎక్కువగా టూ వీలర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎక్కడెక్కడ గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయంటే?



భారతీయులకు బంగారం అంటే ఎంత ఇష్టం ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పండగలు, శుభకార్యాలు, ఇతర వేడుకల సమయాల్లో గోల్డ్ ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు గరిష్టాలకు చేరిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బంగారం రేట్లు తనిష్క్, కల్యాణ్ జువెల్లర్స్, మలబార్ గోల్డ్, జోయాలుక్కాస్ ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయనేది తెలుసుకుందాం. బంగారం రేట్లు కొండెక్కుతున్నా యి. ఇటీవలి కాలంలో వరుసగా భారీగా పెరిగి ఆల్ టైమ్ హైకి చేరిన సంగతి తెలిసిందే. గురువారం రోజు మరోసారి భారీగా పెరిగాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను జూన్ సమీక్షలో తగ్గించొచ్చని సంకేతాలు వచ్చాయి. ఈ కారణంతోనే బంగారం ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఫెడ్ వడ్డీ రేట్లను పెంచితే యూఎస్ డాలర్, బాండ్ ఈల్డ్స్ గిరాకీ పెరిగి బంగారానికి విలువ తగ్గుతుంటుంది. అప్పుడు రేట్లు పడిపోతుంటాయి. అదే ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించిన సమయంలో.. బంగారానికి విలువ పెరిగి రేట్లు కూడా పెరుగుతుంటాయి. ఇప్పుడు ఫెడ్ అంచనాల నేపథ్యంలోనే గోల్డ్ రేట్లు జీవన కాల గరిష్టాల్లో కదలాడుతున్నాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ధర గురువారం రోజు 10 గ్రాములకు రూ. 162,298కి చేరుకుంది. మార్చి మొదటి వారంలోనే రూ. 2700 మేర పెరగడం గమనార్హం. దీంతో బంగారం కొనాలనుకునేవారికి షాక్ మీద షాక్ తగులుతుందని చెప్పొచ్చు. బంగారంధరలు ఒక్కో చోటు ఒక్కోలా ఉంటాయని చెప్పొచ్చు. రాష్ట్రాన్ని బట్టి.. నగరాన్ని బట్టి.. క్యారెట్స్‌ను బట్టి.. ఇంకా షాపుల్ని బట్టి కూడా గోల్డ్ రేట్లలో వ్యత్యాసం ఉంటుందని చెప్పొచ్చు. దేశంలోని 4 ఫేమస్ జువెలరీ బ్రాండ్లలో పసిడి రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.
గోల్డ్ జువెలరీని షాపుల్లో 22 క్యారెట్లకు చెందినవాటినే విక్రయిస్తారన్న సంగతి తెలిసిందే. తనిష్క్ జువెల్లరీలో ప్రస్తుతం 22 క్యారెట్స్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 162,290 గా ఉంది. మలబార్ గోల్డ్‌లో బంగారం ధర 22 క్యారెట్లపై తులానికి రూ. 160,100 గా ఉంది. జోయాలుక్కాస్, కల్యాణ్ జువెల్లర్స్‌లో కూడా పుత్తడి ధర రూ. 160,100 వద్దే ఉంది. 24 క్యారెట్ల బంగారాన్ని ప్యూర్ గోల్డ్ అని పిలుస్తారు. ఇది బంగారు ఆభరణాలు తయారు చేసేందుకు వీల్లేకుండా ఉంటుంది. ఆభరణాలు తయారు చేసేందుకు 22 క్యారెట్స్ గోల్డ్ ఉపయోగిస్తుంటారు. దీనిలో 91.6 శాతం గోల్డ్ ఉంటుంది. జువెల్లర్స్‌లో 18 క్యారెట్స్, 14 క్యారెట్ల బంగారం కూడా కొనుగోలు చేయొచ్చు. ఈ ధర 22 క్యారెట్ల బంగారం ధర కంటే తక్కువగానే ఉంటుంది.

# మహిళల కోసం స్పెషల్..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బ్యాంకులు మహిళల ఆర్థికాభి వృద్ధిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాయి. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు, బ్యాంకులు అందిస్తున్న వివిధ పథకాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం వివిధ రకాల సంక్షేమ, ఆర్థికాభివృద్ధి కోసం వివిధ రకాల పథకాలను అమలు చేస్తున్నాయి. వర్గాల వారీగా చాలా రకాల పథకాలు తీసుకొస్తుంటాయి. అయితే, అందులో కొన్ని మాత్రమే ప్రజలకు చేరువవుతున్నాయి. చాలా పథకాల పేర్లు కూడా ప్రజలకు తెలియకపోవడం గమనార్హం. అలాగే ప్రభుత్వాలు, బ్యాంకులు మహిళా సాధికారత కోసం ఎన్నో రకాల పథకాలను అందిస్తున్నాయి. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న ఈ పథకాల గురించి ఈ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓసారి తెలుసుకుందాం.
ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటు న్నాయి. అందులో భాగంగా వారికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. సేవింగ్స్ ఖాతాల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు, క్రెడిట్ కార్డులు, రుణాలు వంటి ఎన్నో రకాల ప్రత్యేక పథకాలను తీసుకొచ్చి లబ్ధిచేకూ రుస్తున్నాయి. అలాగే బ్యాంకులు సైతం వివిధ రకాల స్కీమ్స్, ప్రత్యేక ఆఫర్ల ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నాయి. మహిళాసాధికారత కోసం దేశీయ అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్త్రీ శక్తి స్కీమ్ తీసుకొచ్చింది. దీని ద్వారా తమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు రూ.50 లక్షల వరకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. మరోవైపు.. ఓరియంటల్ బ్యాంక్ మహిళా వికాస్ యోజన పేరుతో మహిళల చిన్న వ్యాపారాలకు రూ. 25 లక్షల వరకు ఎలాంటి కొల్లాటరల్ లేకుండా రుణాలు ఇస్తోంది. అలాగే భారతీయ మహిళా బ్యాంక్, అన్నపూర్ణ స్కీమ్ వంటివి సైతం మహిళల కోసం తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాలు.. మహిళలు వ్యాపారంలో రాణించేందుకు స్కీమ్ ద్వారా వ్యాపారాలకు కావాల్సిన రుణాలు, గ్రాంట్లను అందించడంతో పాటు శిక్షణ సైతం ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం. అలాగే మహిళా శక్తి కేంద్రాల ద్వారా కూడా నైపుణ్యాభి వృద్ధిలో శిక్షణ ఇస్తోంది. వీటి ద్వారా మహిళలు ఉపాధి పొందేందుకు కృషి చేస్తోంది. అలాగే మహిళా ఇ-హాత్ ద్వారా తమ వ్యాపారాలు, ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తోంది. అలాగే ముద్రా లోన్స్ లో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తోంది. ప్రధాన మంత్రి రోజ్గార్ యోజన, మహిళా ఉద్యమ్ నిధి, ఉద్యోగిని స్కీమ్స్, లక్‌పతిదీదీ స్కీమ్ వంటివి తీసుకొచ్చింది కేంద్రం. మహిళా సాధికారత కోసం చాలా రకాల పథకాలు అందిస్తోంది. పెట్టుబడుల విషయానికి వస్తే.. మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ప్రకటించారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్. ఈ స్కీమ్ ద్వారా 7.5 శాతం వడ్డీ ఇస్తోంది. అలాగే 10 ఏళ్లలోపు ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన స్కీమ్ తీసుకొచ్చారు. దీని ద్వారా 8.2 శాతం మేర వడ్డీ కల్పిస్తోంది. అలాగే మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్ ద్వారా రెండేళ్ల డిపాజిట్లపై అధిక వడ్డీ కల్పిస్తోంది. వీటితో పాటు నెలవారీ కనీస బ్యాలెన్స్, బ్యాంక్ లావాదేవీల్లో ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నాయి బ్యాంకులు. వివిధ రకాల లోన్ల ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ రేట్లపైనా పలు బ్యాంకులు డిస్కౌంట్స్ అందిస్తున్నాయి.

# 217 సార్లు కోవిడ్ టీకా వేయించుకున్న 62 ఏళ్ల వ్యక్తి...

నాలుగేళ్ల కిందట ప్రపంచంపై కరోనా మహమ్మారి దాడిచేసి లక్షల మంది ప్రాణాలను తీసింది. ఈ వైరస్ బారినపడి కోట్లాది మంది బాధితులయ్యారు. కోవిడ్-19ను అడ్డుకోడానికి యుద్ధ ప్రాతిపదికన అన్ని దేశాలు టీకాల కోసం ప్రయోగాలు మొదలుపెట్టాయి. క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యాక్సిన్లు రావడంతో జనం కుదుటపడ్డారు. కానీ, వీటి వల్ల కూడా దుష్ప్రభావాలు ఉన్నాయనే ప్రచారం కూడా సాగింది. కానీ, దీనికి విరుద్ధంగా ఓ వ్యక్తి 200 డోస్‌లు తీసుకున్నాడు.ప్రపంచానికి కంటిమీద కునుకులేకుండా చేసిన కరోనా మహమ్మారిని నిలువరించే టీకా అందుబాటులోకి రాగానే ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు డోస్‌లు వేసుకుని, తరువాత బూస్టర్ డోసుపై చాలా చర్చ జరిగింది. కానీ, అయితే జర్మనీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 2017సార్లు కోవిడ్-19 టీకా తీసుకున్నాడు. కేవలం 29 నెలల వ్యవధిలోనే ప్రయివేట్‌గా టీకా తీసుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోనీ 62 ఏళ్ల అతడు క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా తీసుకున్నాడా? అంటే అదీకాదు. వైద్య సలహాలకు విరుద్ధంగా ఇలా చేసినట్టు ఈ కేసు గురించి ది లాన్సెట్ ఇన్ఫెక్టిసియస్ డిసీజెస్ జర్నల్ ప్రచురించింది. ఆయన తీసుకున్న 217 డోసుల్లో 134 అధికారిక వర్గాల ద్వారా తీసుకున్నట్టు ధ్రువీకరించారు. మిగతా 83 మాత్రం ఆయన తనకు తానుగా తీసుకున్నాడు.

**కోవిడ్ టీకాలు దుష్ప్రభావాలకు కారణ మవుతా యి. వీటిలో టీకా తీసుకున్న ప్పుడు చేయి నొప్పి కలగడమనేది ఓ సాధారణ ప్రభావం. లేదంటే జ్వరం, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. 'అతడి రోగనిరోధక వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి వివిధ గుర్తులను కూడా పరిశీలించారు. ఇందులో ప్రధానమైన రెండు కణ వ్యవస్థ లు కణాలు, కణాలు ఉన్నాయి. హైపర్ వాక్సినేషన్ ద్వారా తరుచూ వైరస్‌కు గురికావడం రోగనిరోధకతను దెబ్బతీ స్తుందనే ఆందోళనలకు విరుద్ధంగా అతడి లో కణాలు, కణాల ఉత్పత్తి పరిమాణాన్ని పెంచింది' అధ్యయనం కనుగొంది.**

అయితే, ఆయనకు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలూ ఎదురు కాలేదని ఎర్లాంజెన్-న్యూరెంబర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చెప్పారు. 'ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాం' అని ఆ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ కిలియన్ స్కోబర్ పేర్కొన్నారు. "మేం ఆయనను వివిధ పరీక్షల కోసం ఎర్లాంజెన్ యూనివర్సిటీకి రప్పించాం.. ఆయన కూడా ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఎంతో ఆసక్తి చూపారు. ఆయన నుంచి రక్తం, లాలాజాల నమూనాలను సేకరించాం" అని డాక్టర్ కిలియన్ స్కోబర్ తెలిపారు.
వీటితోపాటు గతంలో ఆయన నుంచి వైద్య పరీక్షల కోసం తీసుకున్న గడ్డకట్టిన రక్త నమూనాలను పరీక్షించారు. "అధ్యయనం సమయంలో మరోసారి ఆయన టీకా తీసుకున్నప్పుడు కూడా మేం రక్త నమూనాలను సేకరించాం" అని చెప్పారు. "టీకాలకు రోగనిరోధక వ్యవస్థ ఎలా ప్రతిస్పందిస్తోందనే విషయాన్ని నిర్ధరించడానికి ఈ నమూనాలను ఉపయోగిస్తాం' అని తెలిపారు.
ఒక వ్యక్తికి 217 సార్లు టీకాలు ఇచ్చారనే





విషయంపై మాగ్దెబర్గ్ నగర పబ్లిక్ ప్రాసిక్యూటర్ విచారణ ప్రారంభించారు. ఈ మేరకు ఆయన 130 సార్లు టీకాలు ఇచ్చినట్టుగా ఆధారాలు సేకరించారు. అయితే దీనిపై ఇప్పటిదాకా నేరాభియోగాలు నమోదు చేయలేదు. కోవిడ్ టీకాలు ఇన్ఫెక్షన్లకు కారణం కావు. కానీ వ్యాధులతో ఎలా పోరాడాలో శరీరానికి నేర్పుతాయి. అయినప్పటికీ, 'హైపర్ వాక్సినేషన్' నియమావళికి నేరుగా ఆపాదించవచ్చా? అనేది అస్పష్టంగా ఉందని పరిశోధకులు హెచ్చరించారు. అల్బెర్ట్ ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమిలీ హ్యాపీ మిల్లర్ మాట్లాడుతూ.. 'సరైన మార్గదర్శకాలను అనుసరించకుండా ఓ వ్యక్తి వందల సంఖ్యలో కోవిడ్ టీకాలు తీసుకోవడం అనేది చాలా అసాధారణ సంఘటన.. టీకా మొదటి మూడు డోస్‌లతో రక్షించిడం వల్ల బహుశా అతడు కోవిడ్ బారినపడకపోవచ్చు. అతని ప్రవర్తన గురించి కూడా మాకు ఏమీ తెలియదు.' అని అన్నారు. ఎంఆర్ఎన్ఏ టీకాలు శరీర కణాలకు వైరస్‌కు సంబంధించిన జెనెటిక్ కోడ్‌ను చూపేలా పనిచేస్తాయి. దీన్ని రోగనిరోధక వ్యవస్థ గుర్తించి కోవిడ్ మీద పోరాటం చేయడం ఎలాగో తెలుసుకుంటుంది. కానీ, పదేపదే టీకాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక వ్యవస్థలోని కొన్ని కణాలు క్రియాశీలతను కోల్పోతాయి. అయితే, ఆశ్చర్యకరంగా ఈ జర్మనీ వ్యక్తిలో అలాంటి లక్షణాలేవీ కనిపించలేదని పరిశోధకులు గుర్తించారు. దీంతోపాటు ఎప్పుడూ కరోనా బారినపడిన లక్షణాలను కూడా గుర్తించలేదు. రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు తాము ఈ 'హైపర్ వ్యాక్సినేషన్' విధానాన్ని ఆమోదించబోమని పరిశోధకులు తెలిపారు. అయితే జర్మనీ వ్యక్తిపై జరిపిన అధ్యయనం ద్వారా ఎలాంటి తుది నిర్ణయానికీ రాలేకపోయారు గానీ, కొన్ని సూచనలు చేయగలిగారు. "తాజా పరిశోధనల ద్వారా సాధారణ టీకాలతో పాటు మూడు డోసుల వ్యాక్సినేషన్ అనేది ఆమోదనీయమైన విధానమే' అని యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. కోవిడ్ టీకాలు సాధారణంగా సమయానుకూలంగా ఇస్తారు. కానీ రోగనిరోధక వ్యవస్థ అతి బలహీనంగా ఉన్న కొంత మందికి ఇతర సమయాల్లో అవసరాన్ని బట్టి అదనపు డోసులు ఇవ్వాల్సి రావచ్చు. ఇలాంటి వారిని జాతీయ ఆరోగ్య సంస్థ సంప్రదించి, అర్హులను గుర్తిస్తుంది.
కోవిడ్ టీకాలు దుష్ప్రభావాలకు కారణమవుతా యి. వీటిలో టీకా తీసుకున్నప్పుడు చేయి నొప్పి కలగడమనేది ఓ సాధారణ ప్రభావం. లేదంటే జ్వరం, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. 'అతడి రోగనిరోధక వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి వివిధ గుర్తులను కూడా పరిశీలించారు. ఇందులో ప్రధానమైన రెండు కణ వ్యవస్థలు కణాలు, కణాలు ఉన్నాయి. హైపర్‌వాక్సినేషన్ ద్వారా తరుచూ వైరస్‌కు గురికావడం రోగనిరోధకతను దెబ్బతీస్తుందనే ఆందోళనలకు విరుద్ధంగా అతడిలో కణాలు, కణాల ఉత్పత్తి పరిమాణాన్ని పెంచింది' అధ్యయనం కనుగొంది.

# 2035 నాటికి జాబిల్లిపై అణు విద్యుత్ కేంద్రం..

అంతరిక్ష రంగంలో అగ్రదేశాల మధ్య పోటీ తీవ్రతరం అవుతోంది. అయితే, ఇది ఎటువంటి అనర్థాలకు దారితీ స్తుందోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై ఏకంగా అణు విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి రష్యా, చైనాలు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ఇప్పటికే పట్టాలెక్కినట్టు ప్రకటన చేశాయి. ఇదే నిజమైతే చంద్రుడిపై 2035 నాటికి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సిద్ధమవుతుంది. గతేడాది రష్యా చేపట్టిన లూనా-25 మిషన్ విఫలమైన విషయం తెలిసిందే. చంద్రునిపై అన్వేషణలో మరో కీలక ముంద డుగు పడింది. మనిషి శాశ్వత నివాస కలను వీలైనంత త్వరగా సాకారం చేయాలని రష్యా, చైనాలు భావిస్తున్నాయి. అందుకు అవసరమైన విద్యుత్ తయారీని సోలార్ ప్యానళ్లు తీర్చలేకపోవచ్చనే ఉద్దేశంతో ఏకంగా అణు విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చాయి. అందుకోసం ఇప్పటికే సంయుక్త కార్యాచరణను ప్రారంభించాయి. ఈ నిర్మాణాన్ని 2033 నుంచి 2035లోపు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇప్పటికే మొదలైందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ చీఫ్ యూరీ బోరిసోవ్ వెల్లడించారు. అయితే, ఇది అనుకు న్నంత సులువు కాబోదని యూరీ అంగీకరించారు. కాక పోతే, 'న్యూక్లియర్ స్పేస్ ఎనర్జీ రంగంలో రష్యాకు అపార నైపుణ్యం ఉంది.. ఈ ప్రాజెక్ట్‌కు ఇది బాగా ఉపయోగపడ నుంది... మేం తలపెట్టిన ప్రాజెక్టు చంద్రునిపై మనిషి శాశ్వత ఆవాసం దిశగా కీలక ముందడుగు కానుంది. అక్కడ మున్ముందు ఎదురయ్యే ఇంధన అవసరాలు, డిమాండ్లను తీర్చేందుకు సోలార్ ప్యానళ్లు సరిపోవు... అణు విద్యుతే ఇందుకు సమర్థమైన ప్రత్యామ్నాయం. కాబట్టి బాగా ఆలోచించిన మీదట ఈ ప్రాజెక్టును ప్రారంభించాం' అని ఆయన వివరించారు. కానీ, చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు మాటల్లో చెప్పినంత సులువేమీ కాదు. ఇందుకోసం ఇప్పటికే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు యూరీ వెల్లడించారు. తొలి దశలో మానవ ప్రమేయం లేకుండా చంద్రునిపై అణు ప్లాంటు స్థాపన ప్రయత్నాలు పూర్తి ఆటోమేటెడ్ పద్ధతిలో సాగు తాయి. ఇందుకోసం ప్రధానంగా రోబోల రంగంలోకి దింపి.. వాటి సాయంతో పని నడిపిస్తారు. స్పేస్ టగ్‌బోట్ పేరిట అణు విద్యుత్‌తో నడిచే వ్యోమనౌకను అభివృద్ధి చేసే యోచనలో రష్యా ఉంది. ఇందులో భారీ అణు రియాక్టర్‌తో పాటు హై పవర్ టర్బైన్లు కూడా ఉంటాయి. విద్యుత్కేంద్రం నిర్మాణానికి అవసరమైన సామగ్రిని చంద్రునిపైకి దాని ద్వారా పంపుతారు. నిర్మాణ క్రమంలో వెలువడే అంతరిక్ష వ్యర్థాలు తదితరాలను ఈ నౌక శుద్ధి చేస్తుంది. జాబిల్లిపై అణు విద్యుత్కేంద్రం నిర్మాణంలో ఇమిడి ఉన్న అనేక సాంకే తిక సమస్యలను అధిగమించడంలో రష్యా, చైనా తలమున కలయ్యాయి. కానీ, న్యూక్లియర్ పవర్ ప్లాంటును ఎప్పటిక ప్పుడు చల్లబరచడం అత్యంత కఠినమైన సవాళ్లతో కూడు కున్నది. గతేడాది, చంద్రుడిపై అన్వేషణకు రష్యా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లూనా 25 ప్రయోగం విఫలమై ంది. వ్యోమనౌక దక్షిణ ధ్రువాన్ని చేరే క్రమంలో అదుపు తప్పి పేలిపోయింది. ఆ ఎదురుదెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయినా, అణు కేంద్రం విషయంలో వెనక్కు తగ్గకూడదనే పట్టుదలగా ఉంది. చైనాతో కలిసి మానవసహిత జాబిల్లి యాత్ర, ఆ వెంటనే చంద్రునిపై శాశ్వత కేంద్రం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. చైనా కూడా 2030 నాటికల్లా తొలి వ్యోమగామిని చంద్రునిపైకి పంపడమే లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎర్ర సముద్రంలో కార్గో నౌకపై హౌతీలు క్షిపణి దాడి..

గాజాలోని హమాస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గత అక్టోబరు 8 నుంచి ఇజ్రాయేల్ సైన్యాలు భీకర దాడులు చేస్తున్నాయి. తమ దేశంలోకి చొరబడి మారణహోమా న్ని సృష్టించిన హమాస్ ముష్కరులపై ప్రతీకారంతో ఇజ్రాయేల్ యుద్ధం సాగిస్తోంది. అటు, హమాస్‌కు మద్దతుగా పలు ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు.. ఇజ్రాయేల్, దాని మిత్ర దేశాల కార్యాల యాలు, నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఎర్ర సముద్రంలో హౌతీ తిరుగుబాటుదారుల దాడులు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. కార్గో నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. తాజాగా, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో 'ట్రూ కాన్ఫిడెన్స్' కార్గో నౌకపై క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది చనిపోగా, మరో ఆరుగురు గాయపడ్డారు. నౌక కూడా దాడిలో దెబ్బతింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు ధ్రువీకరించారు.
గాయపడినవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. యెమెన్ నగరం ఎడెన్‌కు 90 కి.మీ దూరంలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బార్బడోస్ జెండా ఉన్న ఈ నౌక చైనా నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డాకు వెళ్తున్నట్లు ట్రాకింగ్ డాటా వెల్లడించింది. గాజాపై ఇజ్రాయేల్ దాడులను వ్యతిరేకిస్తూ పాలస్తీనాకు మద్దతుగా గత నవంబరు నుంచి కార్గో నౌకలపై హూతీ తిరుగుబాటుదారులు చేస్తున్న దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారి. గ్రీస్ యాజమాన్యానికి చెందిన 'ట్రూ కాన్ఫిడెన్స్' కార్గో నౌక బార్బడోస్ జెండాతో వెళుతుండగా ఈ దాడి చోటుచేసుకుంది. దీంతో నౌకకు భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు యాజమాన్యం తెలిపింది. అటు, హౌతీలు మాత్రం తమ హెచ్చరికలను నౌక సిబ్బంది పట్టించుకోలేదని ప్రకటన చేయడం గమనార్హం. ఈ ఘటనపై స్పందించిన యెమెన్‌లోని బ్రిటిష్ రాయబార కార్యాలయం... అమాయకులైన ముగ్గురు నౌకా సిబ్బంది చనిపోయారని, ఇది చాలా బాధకరమైన అంశమని పేర్కొంది. నౌకలపై పదే పదే హూతీలు నిర్లక్ష్యపూరితంగా దాడులకు పాల్పడుతూ అంతర్జాతీయ వాణిజ్యానికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడింది. ఇది వెంటనే ఆపాలని ఉద్ఘాటించింది. దాడి సమాచారం అందిన వెంటనే నౌక, సిబ్బందికి రక్షణగా అమెరికా నేతృత్వంలోని యుద్ధనౌకలు వెళ్లినట్లు సమాచారం.



# నేడు విరోష్ దంపతుల రిసెప్షన్

## ఆహ్వానం ఉన్నవారికే ఎంట్రీ

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (వీరోష్) పెళ్లి వేడుకలు ఘనంగా ముగుస్తున్నాయి. ఉదయ్‌పూర్‌లో ఫిబ్రవరి 26న వీరి వివాహం అత్యంత ప్రైవేట్‌గా జరిగిన విషయం తెలిసిందే. మార్చి 2న సొంతూళ్లో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం సాగింది. ఇక మార్చి 4 బుధవారం హైదరాబాద్‌లో వీరి గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్ జరగనుంది. ఈ వేడుకకు సంబంధించి 'టీమ్ విరోష్' తాజాగా కీలక ప్రకటన విడుదల చేసినట్లు తెలుస్తుంది. ఈ రిసెప్షన్‌కు ఆహ్వానించిన అతిథులకు మాత్రమే అనుమతి ఉండబోతున్నట్లు సమాచారం. ప్రతి అతిథికి ఒక ప్రత్యేకమైన ఒకసారి మాత్రమే ఉపయోగించగల క్యూఆర్ కోడ్‌ను పంపినట్లు సమాచారం. ఎంట్రీ వద్ద దీనిని స్కాన్ చేసిన తర్వాతే లోపలికి అనుమతించబోతున్నారు. అలాగే ఆహ్వాన పత్రిక మరియు క్యూఆర్ కోడ్ లేని అభిమానులు, ఇతరులు ఎవరూ వేదిక వద్దకు రావద్దని టీమ్ విరోష్ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. మరోవైపు ఈ వేడుక జరిగే ప్రాంతం మొత్తం పోలీసుల పర్యవేక్షణలో ఉంటుందని, భద్రతా కారణాల దృష్ట్యా ఎవరినీ అనుమతించ బోమని స్పష్టం చేశారు. అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతల దృష్ట్యా ఈ కఠిన ని ం్ణ య్ ం ం తీసుకున్నట్లు



# అల్లూ వారింట పెళ్లి బాజాలు

### ఘనంగా శిరీష్ ప్రీవెడ్డింగ్ రిసిప్షన్

అల్లూ వారింట పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. తన ప్రేయసి నయనికా రెడ్డితో ఈ నెల 6న శిరీష్ వివాహం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా అల్లూ కుటుంబం హైదరాబాద్‌లోని అల్లూ స్టూడియోస్‌లో భారీ స్థాయిలో ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇండస్ట్రీ నుంచి నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున, రామ్ చరణ్, మోహన్ బాబు, నాని, నాగచైతన్య, గోపీచంద్, బ్రహ్మానందం, రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. దర్శకుల్లో కె. రాఘవేంద్రరావు, అట్లీ, వి.వి. వినాయక్ పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత అశ్వనీ దత్ కూడా ఈ వేడుకలో కనిపించారు. రాజకీయ వర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, ఏపీ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమంలో మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. టొవినో థామస్ హీరోగా తెరకెక్కించిన సూపర్ హీరో చిత్రం మిన్నల్ మురళితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాసిల్ జోసెఫ్ ఈ వేడుకలో కనిపించడంతో ఇండస్ట్రీ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఇటీవల అల్లు అర్జున్ హీరోగా బాసిల్ జోసెఫ్ ఓ సూపర్ హీరో కథను తెరకెక్కించబోతున్నారన్న వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. 'శక్తిమాన్' పేరుతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సిద్ధమవుతోందని ప్రచారం జరిగింది.

అయితే ఆ వార్తల్లో నిజం లేదని బాసిల్ గతంలో స్పష్టం చేశారు. అయినప్పటికీ శిరీష్ ప్రీ-వెడ్డింగ్ వేడుకలో బన్నీ స్వయంగా బాసిల్‌ను అందరికీ పరిచయం చేయడం మళ్లీ ఆ ప్రాజెక్ట్‌పై ఊహాగానాలకు తెరలేపింది. ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, బన్నీ?బాసిల్ జోసెఫ్ కాంబినేషన్‌లో ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ రెండు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఒకటి అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ హీరో పాన్ వరల్డ్ చిత్రం కాగా, మరొకటి లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్.

# పెద్ది సినిమా రన్‌టైమ్‌పై ఊహాగానాలు



ఆ వార్తలను కొట్టి పారేసిన చిత్రబృందంప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ నిడివి గల సినిమాల ట్రెండ్ నడుస్తోంది. కంటెంట్ బలంగా ఉంటే మూడు గంటలకు పైగా రన్ టైం ఉన్నా ప్రేక్షకులు ఆదరిస్తారని రీసెంట్‌గా 'పుష్ప 2' నిరూపించింది. ఈ క్రమంలోనే సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కూడా 3 గంటల కంటే ఎక్కువ నిడివితో ఉండబోతోందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. సినిమా రఫ్ కట్ ఏకంగా 4 గంటలకు పైగా వచ్చిందని, ఎడిటింగ్ తర్వాత కూడా అది 3 గంటల పైనే ఉంటుందని ప్రచారం జరిగింది.అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాలు కొట్టిపారేశాయి. సినిమా నిడివి గురించి వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, అభిమానులు వీటిని నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. షూటింగ్ దశలో ఉన్న సినిమా రన్ టైం గురించి ఇప్పుడే మాట్లాడటం సరికాదని, దర్శకుడు బుచ్చిబాబు ఒక పక్కా ప్లానింగ్‌తో సినిమాను రూపొందిస్తున్నారని తెలిపారు. ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆడియన్స్‌కు బోర్ కొట్టకుండా సరైన నిడివితోనే వస్తుందని భరోసా ఇచ్చారు. వృద్ధి సినిమాస్ పతాకంపై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై నేషనల్ లెవెల్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. చరణ్ ఒక విభిన్నమైన లుక్‌లో కనిపిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

# 5న వృషకర్మ గ్లింప్స్ విడుదల




అక్కినేని నాగచైతన్య హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ'. 'విరూపాక్ష' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దీనిపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఈ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్వహించేందుకు మేకర్స్ ఒక ఆసక్తికరమైన వేదికను ఎంచుకున్నారు. ఈ నెల 5న విడుదల కానున్న 'వృషకర్మ' గ్లింప్స్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పి సి ఎక్స్ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నారు.గురువారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కేవలం మీడియా ప్రతినిధులు మాత్రమే కాకుండా, పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు కూడా ఈ ఈవెంట్‌కు హాజరుకానున్నారు. భారీ స్కేల్‌తో, హై టెక్నికల్ వాల్యూస్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ గ్లింప్స్ చైతు కెరీర్‌లోనే ఒక కొత్త మైలురాయిగా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




# లావణ్య త్రిపాఠి..సతీలీలావతి విడుదల వాయిదా

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సతీ లీలావతి' విడుదల వాయిదా పడింది. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకుంది. నరేష్, వీటీవీ గణెళిష్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేశారు. మొదటగా మార్చి 6న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే విడుదలకు సమీపిస్తున్న వేళ అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడంతో రిలీజ్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దుర్గాదేవి పిక్చర్స్ విడుదల చేసిన ప్రకటనలో, 'లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'సతీ లీలావతి' చిత్రాన్ని మార్చి 6న విడుదల చేయాలని భావించాం. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిర్ణయించిన తేదీన విడుదల సాధ్యంకాలేదు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం. ఎలాంటి రాజీ లేకుండా, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా చిత్రాన్ని సిద్ధం చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథను మలిచినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'శివ మనసులో శ్రుతి', 'శంకర' వంటి చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు తాతినేని సత్య ఈసారి పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అందించనున్నారని తెలుస్తోంది. ఇక లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత విడుదలవుతున్న తొలి చిత్రం కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఆమె కొత్త లుక్, పాత్రలోని వైవిధ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని యూనిట్ నమ్మకంగా చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై హైప్ పెరిగింది. వాయిదా వార్త అభిమానులను కొంత నిరాశకు గురి చేసినప్పటికీ, క్వాలిటీ కోసం తీసుకున్న నిర్ణయమని మేకర్స్ స్పష్టం చేయడంతో సినీ ప్రియులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# థియేటర్లలో ఈ వారం పలు కొత్త సినిమాలు

ఈ వారం థియేటర్లలో పలు సినిమాలు విడుదలవుతున్నాయి. శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ్'. శ్రీ హుసేన్ షా కిరణ్ దర్శకుడు. రెబా మోనికా జాన్ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉత్కంఠ రేకెత్తించే కథ, కథనాలతో ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది. పాటలు, వినోదం లేకుండా సాగే అచ్చమైన క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించినట్లు చిత్ర బృందం తెలిపింది.ఇకపోతే 'ఈ చిత్రం నవ్విస్తుంది, భయపెడుతుంది. చివరివరకూ ఉత్కంఠభరితంగా సాగుతుంది' అంటున్నారు శివాజీ. ఆయన కీలక పాత్రలో ఈటీవీ విన్ ఒరిజినల్ మూవీగా రూపొందిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. లయ కథానాయిక. ఈ మూవీలో అలీ, ధనరాజ్, రోహన్, బబ్లూ, చిత్రం శ్రీను, కమల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తొలుత ఈ మూవీని నేరుగా ఈటీవీ విన్ ఓటీటీ వేదికగా విడుదల చేయాలనుకున్నారు.

# కేరళ స్టోరీ-2 నుంచి కేరళ తొలగించాలి

## చిత్రంపై హైకోర్టులో మరో వ్యాజ్యం



బాలీవుడ్ నుంచి వచ్చిన 'ది కేరళ స్టోరీ 2' సినిమా టైటిల్ వివాదం కేరళ హైకోర్టులో మరో మలుపు తిరిగింది. ఈ చిత్ర పేరు నుంచి 'కేరళ' అనే పదాలను తొలగించాలని కోరుతూ తాజాగా మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కేరళ రాష్ట్రాన్ని ఉగ్రవాదానికి, మతమార్పిడులకు నిలయంగా చిత్రీకరిస్తూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా ఈ సినిమా ఉందని పిటిషనర్లు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై కోర్టు కూడా స్పందిస్తూ.. సినిమా విడుదలను వాయిదా వేయగా.. చిత్రబృందం డివిజన్ బెంచ్ నుంచి పర్మిషన్ తెచ్చుకుని విడుదల చేసింది. అయితే ఈ సినిమా విడుదలైన అనంతరం సినిమా టైటిల్‌ను మార్చాలంటూ ఒక రిటైర్డ్ సోషల్ సైన్స్ టీచర్, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ఒక మహిళా న్యాయవాది కలిసి పిటిషన్‌ను వేశారు. కేరళ పేరును టైటిల్‌లో వాడటం వల్ల ప్రపంచవ్యాప్తంగా కేరళీయులపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ఇది కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ప్రచారమని పిటిషన్‌లో తెలిపారు. మరోవైపు ఈ సినిమా విడుదలై మిశ్రమ స్పందనలను తెచ్చుకుంది.

Udayam :- printed.Editor ,Pblished and owendBy M.chandrasekher.plat no12journalistcolany.near B.t.r.Nagar.vartha office Back said k.g.Road.kurnool.andrapradesh.pin518001.Printed At Uttejitha printers.Kurnool.Ap cell.9000313849. RNI Aptel2015/62159.